RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 121 | మే 29 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 121 | May 29 Fryday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

తగ్గిన బంగారం ధరలు 2

## ప్రధాని కార్యాలయ పర్యవేక్షణలో 'నీట్' రీటెస్ట్

### కేంద్రం పకడ్బందీ చర్యలు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ (చీజుజు) పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం రాబోయే పునఃపరీక్షను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గతంలో జరిగిన ప్రవేశ పరీక్ష రద్దు కావడంతో, జూన్ 21న నిర్వహించబోయే రీటెస్ట్‌ను ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని కేంద్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఈ క్రమంలోనే ఈసారి పరీక్షా ప్రక్రియ మొత్తాన్ని ప్రధానమంత్రి కార్యాలయం నేరుగా పర్యవేక్షించనున్నట్లు జాతీయ మీడియా కథనాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన ఢిల్లీ నివాసంలో ఒక ఉన్నత స్థాయి సమీక్షా

➢ మిగతా 2వ పేజిలో..

## సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీల నియామకం



**కేంద్రానికి కొలీజియం సిఫార్సు**

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

సర్వోన్నత న్యాయస్థానంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు కొలీజియం కసరత్తు పూర్తి చేసి కీలక నిర్ణయం తీసుకుంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం బృందం నలుగురు సీనియర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను,

➢ మిగతా 2వ పేజిలో..

## హర్మూజ్ జలసంధి ఎవరి సొత్తు కాదు..

### చర్చలు విఫలమైతే సైనిక చర్యే: డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ముదురుతున్న వేళ, ఇరాన్‌తో శాంతి చర్చలు నడుస్తున్నాయని చెబుతూనే అమెరికా తన సైనిక వ్యూహాలకు పదును పెడుతోంది. హర్మూజ్ జలసంధి పరిసరాల్లోని ఇరాన్ మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు వైమానిక దాడులు నిర్వహించగా, తమ సైన్యానికి పొంచి ఉన్న ముప్పును అడ్డుకునేందుకే ఈ ముందస్తు చర్యలు

## హోర్ముజ్ జలసంధిలో ముదిరిన ఉద్రిక్తతలు

### ఇరాన్ స్థావరాలపై అమెరికా డ్రోన్ దాడులు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి ప్రాంతం మరోసారి తీవ్ర ఉద్రిక్తతలకు వేదికైంది. ఇరాన్ సైనిక చర్యలను అడ్డుకునే వ్యూహంలో భాగంగా అమెరికా దళాలు బుధవారం అర్ధరాత్రి

➢ మిగతా 2వ పేజిలో..

## ప్రతి పౌరుడికి 'సమగ్ర సంక్షేమ కార్డు'

### సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే చోట లభించేలా ఒక సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్) రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ ప్రభుత్వ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఏ పౌరుడికి ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా సాంకేతికతను జోడించాలని ఆయన సూచించారు. ఇందుకోసం తక్షణమే చర్యలు ప్రారంభించాలని, అన్ని ప్రభుత్వ శాఖల నుండి లబ్ధిదారుల పూర్తి డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ వ్యూహాత్మక నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే వ్యవస్థ పరిధిలోకి వస్తుందని, ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో విశ్లేషించడం వల్ల పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. దీనివల్ల అర్హులైన పేదలకు పథకాలు మరింత ఖచ్చితంగా అందుతాయని,

➢ మిగతా 2వ పేజిలో..

## దేశానికే ఆదర్శంగా 'ఫ్యూచర్ సిటీ'

### నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు

**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు భారతదేశానికే ఒక దిక్సూచిలా, ఆదర్శవంతంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గురువారం వారు ఫ్యూచర్ సిటీ పరిధిలో శరవేగంగా నిర్మాణ పనులు జరుపుకుంటున్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనాన్ని, అలాగే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రాబోయే తరాల భవిష్యత్ అవసరాలను, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని ఈ అత్యాధునిక సరికొత్త నగరాన్ని నిర్మిస్తోందని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షించిన అనంతరం, నిర్మాణ పనులలో మరింత వేగం పెంచి, ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత

➢ మిగతా 2వ పేజిలో..



## రెండు ప్రైవేట్ బస్సులు ఢీ

### ఒకరి మృతి, 14 మందికి గాయాలు

**మహబూబ్‌నగర్ జనసంఘర్షణ**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి వేళ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుండి తిరుపతి వైపు ప్రయాణిస్తున్న ఒక ప్రైవేట్ బస్సును, బెంగళూరు మార్గంలో వెళు ్తన్న మరో ట్రావెల్స్ బస్సు వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈ భీకర ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే

➢ మిగతా 2వ పేజిలో..

# దేశానికే ఆదర్శంగా 'ఫ్యూచర్ సిటీ'

**మొదటిపేజీ తరువాయి..** గడువు లోపల పూర్తి చేయాలని అక్కడి అధికారులను మరియు కాంట్రాక్ట్ సంస్థలను ఆదేశించారు. ఈ అత్యాధునిక నగరంలో ఏర్పాటు కాబోతున్న స్కిల్ యూనివర్సిటీ రాబోయే రోజుల్లో దేశీయ మరియు అంతర్జాతీయ పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులలో ఉన్నత నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి, అలాగే ఉపాధి అవకాశాల కల్పనకు ప్రధాన కేంద్రంగా నిలవబోతోందని మంత్రులు ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, కొత్తగా అందుబాటులోకి రానున్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా ఈ నగరంలో చేపట్టే అన్ని రకాల మౌలిక వసతుల కల్పన మరియు అభివృద్ధి పనులకు మరింత పారదర్శకత, వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. రాబోయే కాలంలో ప్రపంచ స్థాయి సంస్థలకు, ఆధునిక సాంకేతిక రంగానికి ఈ నగరం కేరాఫ్ అడ్రస్‌గా మారబోతుందని వివరించారు. పర్యావరణహితంగా, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో ప్రణాళికాబద్ధంగా రూపుదిద్దుకుంటున్న ఈ ఫ్యూచర్ సిటీ, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఇంజన్‌లా మారి దేశానికే తలమానికంగా నిలవడం ఖాయమని మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గట్టిగా పునరుద్ఘాటించారు.

# ప్రతి పౌరుడికి 'సమగ్ర సంక్షేమ కార్డు'

**మొదటిపేజీ తరువాయి..** అదే సమయంలో అనర్హులను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇకపై ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పాత పద్ధతికి స్వస్తి పలికి, ఐటీ శాఖ ఆధ్వర్యంలోనే ఈ సమగ్ర కార్డు ప్రక్రియ సాగాలని రేవంత్ రెడ్డి సూచించారు. సాంకేతికతపై పూర్తి పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ ప్రభుత్వ అధికారులను ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు వినియోగించుకోవాలని చెప్పారు. ఈ నూతన కార్డులో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక, విద్యా శాఖల పథకాలతో పాటు ప్రభుత్వం అందించే వివిధ రకాల ఇన్సూరెన్స్, బీమా పథకాల వివరాలన్నీ అంతర్గతంగా నిక్షిప్తం చేయాలన్నారు. అవసరమైతే కేంద్రం ఇచ్చే ఆధార్ నంబర్ తరహాలోనే రాష్ట్ర స్థాయిలో కూడా ఒక ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్‌ను కేటాయించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (కుల గణన) వివరాలను కూడా ఈ కార్డు డేటాబేస్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. కేవలం లబ్ధిదారుల వివరాలే కాకుండా, వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని కూడా సేకరించాలని ఐటీ శాఖకు బాధ్యతలు అప్పగించారు.

ఈ డిజిటల్ వ్యవస్థలో ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ ఉండాలని సూచించిన సీఎం, ఎక్కడైనా ఒక పౌరుడి మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం వెంటనే ఆటోమేటిక్‌గా 'చేయూత' పెన్షన్ డేటాబేస్‌కు లింక్ అయి, తదుపరి చర్యలు వేగంగా జరిగేలా అంతర్గత అనుసంధానం ఉండాలన్నారు. అలాగే ప్రజల హెల్త్ ప్రొఫైల్‌ను సైతం ఈ సంక్షేమ కార్డుతో జత చేయాలని చెప్పారు. కేరళ రాష్ట్రం నుండి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే కార్మికులు, ఉద్యోగుల కోసం అక్కడ అనుసరిస్తున్న విదేశీ వలస విధానాలను సమగ్రంగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు పాస్‌పోర్టులు, వీసాల జారీకి సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఈ వ్యవస్థ ద్వారా ఒకేచోట అందుబాటులో ఉంచితే, గల్ఫ్ కార్మికులను మోసం చేసే అనధికార ఏజెంట్ల ప్రమేయాన్ని పూర్తిగా అరికట్టవచ్చని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు నూటికి నూరు శాతం చేరడంతో పాటు, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం యొక్క క్షేత్రస్థాయి ప్రభావాన్ని అంచనా వేసేందుకు ఈ సమగ్ర సంక్షేమ కార్డు ఒక దిక్సూచిలా మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ప్రధాని కార్యాలయ పర్యవేక్షణలో 'నీట్' రీటెస్ట్

**మొదటిపేజీ తరువాయి..** సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్‌తో పాటు పీఎంఓ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

ఈ పునఃపరీక్షలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రశ్నపత్రాల రూపకల్పన, ప్రింటింగ్, రవాణా మరియు వాటిని పరీక్షా కేంద్రాలకు సురక్షితంగా చేర్చడం వంటి ప్రతి ఒక్క దశను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలించనుందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు హాజరుకాబోతున్న ఈ మెగా పరీక్షకు సంబంధించిన ప్రతి తాజా అప్‌డేట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా అడిగి తెలుసుకుంటున్నట్లు సమాచారం. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా కేంద్రం అన్ని రకాల ముందస్తు రక్షణ చర్యలను సిద్ధం చేస్తోంది.

# హోర్ముజ్ జలసంధిలో ముదిరిన ఉద్రిక్తతలు

**మొదటిపేజీ తరువాయి..** వేళ ఇరాన్ భూభాగంలోని కీలక స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించాయి. హోర్ముజ్ జలసంధి సమీపంలో తమ బలగాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రయోగించిన నాలుగు వన్‌వే అటాక్ డ్రోన్లను అమెరికా సెంట్రల్ కమాండ్ దళాలు గాలిలోనే అడ్డుకుని విజయవంతంగా ధ్వంసం చేశాయి. దీనికి కొనసాగింపుగా, ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ నౌకాశ్రయ నగరం సమీపంలో ఉన్న ఒక గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌పై అమెరికా క్షిపణి దాడులకు తెగబడింది. ఈ ముందస్తు దాడి వల్ల ఐదో డ్రోన్ ప్రయోగాన్ని తాము అడ్డుకోగలిగామని, ఈ చర్యలు కేవలం తమ ఆత్మరక్షణ కోసమేనని అమెరికా స్పష్టం చేసింది. బందర్ అబ్బాస్ సమీపంలోని ఆ కేంద్రం నుండి అమెరికా నౌకలు మరియు వాణిజ్య నౌకలపై మరిన్ని దాడులు చేసేందుకు ఇరాన్ సిద్ధమవుతోందన్న నిఘా వర్గాల హెచ్చరికలతోనే ఈ రక్షణార్థ దాడులు (డిఫెన్సివ్ స్ట్రైక్స్) చేసినట్లు వైట్ హౌస్ ప్రకటించింది. స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 1:30 గంటల ప్రాంతంలో ఈ భారీ పేలుళ్లు సంభవించగా, ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు వెంటనే అప్రమత్తమయ్యాయి.

ఈ దాడుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా కుప్పకూలిందని, అక్కడ ద్రవ్యోల్బణం 250 శాతానికి చేరిందని పేర్కొన్నారు. ఇరాన్ అత్యంత బలహీన స్థితిలో ఉందని, వారు కేవలం ప్రచారం కోసమే చర్చల ప్రస్తావన తెస్తున్నారని కొట్టిపారేశారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలను నియంత్రించేందుకు ఒమన్, ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరిందన్న వార్తలను వైట్ హౌస్ తోసిపుచ్చింది. హోర్ముజ్ అనేది ఒక అంతర్జాతీయ జలమార్గమని, దానిపై ఏ ఒక్క దేశం పట్టు సాధించడాన్ని అమెరికా అంగీకరించబోదని ట్రంప్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రపంచ ముడి చమురు రవాణాలో 20 శాతం ఇక్కడి నుంచే జరుగుతున్నందున, గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ ఘర్షణల వల్ల ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

ఈ వివాదం కేవలం సముద్ర జలాలకే పరిమితం కాకుండా పశ్చిమాసియా రాజకీయాలను సైతం కుదిపేస్తోంది. హోర్ముజ్ జలసంధిని తమ గుప్పిట్లో ఉంచుకోవాలని చూస్తే ఒమన్‌నైనా సరే వదిలిపెట్టబోమంటూ ట్రంప్ కేబినెట్ సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదరాలంటే సౌదీ అరేబియా, ఖతార్, పాకిస్తాన్, టర్కీ వంటి దేశాలు కచ్చితంగా ఇజ్రాయెల్‌తో సంబంధాలను పునరుద్ధరించే 'అబ్రహం ఒప్పందాలపై' సంతకాలు చేయాల్సిందేనని ఆయన కొత్త నిబంధన విధించారు. దీని ద్వారా ఇరాన్‌ను అంతర్జాతీయంగా ఒంటరి చేయడంతో పాటు, ఆ దేశ అణ్వాయుధ కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని అమెరికా భావిస్తోంది. ఇందుకోసం ట్రంప్ తన ప్రత్యేక దూతలను ఇప్పటికే రంగంలోకి దించారు. అయితే సౌదీ అరేబియా పాలస్తీనా దేశం ఏర్పడితేనే ఇజ్రాయెల్‌తో ఒప్పందం చేసుకుంటామని చెబుతుండగా, పాకిస్తాన్ ఈ ప్రతిపాదనను ముందే తిరస్కరించింది. ఈ నేపథ్యంలో అమెరికా హెచ్చరికలకు గల్ఫ్ దేశాలు లొంగుతాయా లేదా అన్నది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

## హర్మ్యూజ్ జలసంధి ఎవరి సొత్తు కాదు..

**మొదటిపేజీ తరువాయి..** తీసుకున్నామని, ఇందులో భాగంగా పలు ఇరాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా రక్షణ శాఖ ప్రకటించింది. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇరాన్‌తో జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు గనుక విఫలమైతే తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, అవసరమైతే రక్షణ మంత్రిని నేరుగా రంగంలోకి దించి ఆపరేషన్ పూర్తి చేస్తామని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. అమెరికాలో జరగబోయే మధ్యంతర ఎన్నికల వల్ల తాము వెనకడుగు వేస్తామని ఇరాన్ భావిస్తే అది వారి భ్రమ అని, దేశ ప్రయోజనాల ముందు తనకు ఎన్నికలు ముఖ్యం కాదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ ఎలాంటి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు సాధించకూడదన్నదే తమ పట్టుదల అని, ఇది కేవలం అమెరికా భద్రత కోసమే కాకుండా యావత్ ప్రపంచ శాంతి కోసం తాము చేస్తున్న ప్రయత్నమని ఉద్ఘాటించారు. ఇరాన్ నాయకత్వం అమెరికాతో ఒప్పందం కోసం తహతహలాడుతున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూనే, అంతిమంగా తమకు అనుకూలమైన ఫలితమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

వ్యాపార పరంగా అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిపై మాట్లాడిన ట్రంప్, అది ఒక అంతర్జాతీయ జలమార్గమని మరియు దానిపై ఏ ఒక్క దేశానికి పూర్తి నియంత్రణ ఉండేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. ఈ ప్రాంతం ప్రపంచ దేశాలన్నింటికీ తెరిచే ఉంటుందని, తాము కేవలం ఇక్కడ పర్యవేక్షణ మాత్రమే చేస్తామని వివరించారు. ఇదే తరుణంలో హర్మ్యూజ్ చర్చల వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దని ఒమన్‌కు కూడా ఆయన కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఒమన్ కూడా ప్రపంచంలోని మిగతా దేశాల వలె బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అయితే దీనికి భిన్నంగా ఇరాన్ ప్రభుత్వ మీడియా ఒక సంచలన కథనాన్ని వెలువరించింది. ఇరు దేశాల మధ్య ఒక తాత్కాలిక అవగాహన ఒప్పందం కుదిరిందని, యుద్ధ వాతావరణాన్ని తగ్గించేందుకు అమెరికా తన నౌకాదళ దిగ్బంధాన్ని ఎత్తివేసి గల్ఫ్ ప్రాంతం నుండి సైనిక బలగాలను ఉపసంహరించుకోవడానికి అంగీకరించిందని ఇరాన్ మీడియా పేర్కొంది. అంతేకాకుండా, రాబోయే 30 రోజుల్లో హర్మ్యూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు సాధారణ స్థితికి వస్తాయని, ఆ మార్గాన్ని ఇరాన్ మరియు ఒమన్ దేశాలు ఉమ్మడిగా పర్యవేక్షిస్తాయని ప్రచారం చేసింది.

ఇరాన్ మీడియా ప్రసారం చేసిన ఈ కథనాలను అమెరికా వైట్ హౌస్ పూర్తిగా కొట్టిపారేసింది. అవన్నీ కల్పితాలని, ఇరాన్ ప్రభుత్వ ఆధీనంలోని మీడియా చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా వైట్ హౌస్ స్పష్టం చేసింది. మరోవైపు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ అంశంపై స్పందిస్తూ, తాము ఇప్పటికీ దౌత్య మార్గాల ద్వారానే సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని

# రెండు ప్రైవేట్ బస్సులు ఢీ

**మొదటిపేజీ తరువాయి..** అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారందరినీ చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులలో ఒక బస్సు డ్రైవర్ పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, అతనికి వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారని సమాచారం.

ఈ ప్రమాదంలో మరణించిన వ్యక్తిని తిరుపతికి చెందిన రిటైర్డ్ డీఎస్పీ సాంబశివారెడ్డి కుమారుడు అశోక్ రెడ్డిగా పోలీసులు గుర్తించారు. అశోక్ రెడ్డి అకాల మరణంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదంలో మునిగిపోయారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, అతివేగం మరియు డ్రైవర్ల అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన కారణంగా జాతీయ రహదారిపై కాసేపు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో, పోలీసులు ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లోకి మళ్లించి పరిస్థితిని చక్కదిద్దారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు. ఇటీవల కాలంలో రాత్రి వేళల్లో డ్రైవర్ల అలసట, నిద్రమత్తు మరియు మితిమీరిన వేగం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రయాణికులు, డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీల నియామకం

ఒక సీనియర్ మహిళా న్యాయవాదిని సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదనల జాబితాలో పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు, బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీచంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా, జమ్మూ కశ్మీర్ లడఖ్ హైకోర్టు సీజే జస్టిస్ అరుణ్ పల్లిలతో పాటు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వి. మోహన ఉన్నారు. సుప్రీంకోర్టులో గత కొంతకాలంగా పేరుకుపోయిన లక్షలాది కేసుల భారాన్ని తగ్గించి, దేశంలో న్యాయ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఈ నూతన నియామకాలు అత్యంత కీలకమైనవని కొలీజియం తన సిఫార్సు నివేదికలో స్పష్టం చేసింది.

ఈ ఐదుగురిలో సీనియర్ న్యాయవాది వి. మోహనను నేరుగా బార్ అసోసియేషన్ నుండి సుప్రీంకోర్టు జడ్జీగా ప్రతిపాదించడం విశేషం. దీనివల్ల దేశ సర్వోన్నత న్యాయస్థానంలో మహిళా ప్రాతినిధ్యం మరింత పెరిగే అవకాశం ఉంది. కొలీజియం పంపిన ఈ ప్రతిపాదనల జాబితాను కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ప్రాథమికంగా పరిశీలించిన అనంతరం, తుది ఆమోదం కోసం కేంద్ర కేబినెట్‌కు పంపనుంది. కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసిన తర్వాత, ఈ ఫైల్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు వెళుంది. రాష్ట్రపతి కార్యాలయం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడగానే ఈ ఐదుగురు నూతన న్యాయమూర్తులుగా సుప్రీంకోర్టులో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తుల గరిష్ట సంఖ్యను పెంచిన నేపథ్యంలో, ఈ ఐదుగురి నియామకాలు పూర్తయితే అత్యున్నత న్యాయస్థానంలో కార్యకలాపాలు మరింత వేగంగా, చురుగ్గా సాగుతాయని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ, మే28 :** అంతర్జాతీయ మార్కెట్‌లో బులియన్ ధరలు పడిపోవడం, డాలర్ బలపడటం వంటి కారణాలతో భారత మార్కెట్‌లో పసిడి ధరలు దిగివచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు పుంజుకుంటున్నాయి. దీంతో బంగారం, వెండి ధరలు దిగి వచ్చాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,060గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.2230 మేర తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,43,050గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.2050 మేర తగ్గింది. రోవైపు వెండి ధరలు కూడా భారీ తగ్గుదల నమోదు చేశాయి. వెండి కిలోకు పదివేల రూపాయల మేర తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,85,000గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,75,000గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,85,000గా, బెంగళూరులో రూ.2,75,000గా ఉంది.

# ఇల్లందులో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

- 'భారతరత్న' ఇవ్వాలని డిమాండ్

ఇల్లందు మే 28 (జన సంఘర్షణ)

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను ఇల్లందు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. ఇల్లందు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు 'ఎన్టీఆర్ అమర్ హై' అంటూ నినాదాలు చేస్తూ, కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ, సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు మాట్లాడుతూ.. సినీ రంగంలో నటసార్వభౌముడిగా వెలిగిన ఎన్టీఆర్, తెలుగు ప్రజల కష్టాలను చూసి చలించి 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. కేవలం తొమ్మిది నెలల కాలంలోనే అధికారాన్ని చేజిక్కించుకుని, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని కల్పించిన మహోన్నత నాయకుడని



కొనియాడారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిన ఎన్టీఆర్ గారికి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' ఇచ్చి గౌరవించాలని వారు డిమాండ్ చేశారు. పేద ప్రజల ఆకలి తీర్చిన ఘనత ఎన్టీఆర్ గారికే దక్కుతుందని, నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లోని మెజారిటీ నాయకులు ఆయన స్ఫూర్తితోనే ఎదిగారని నేతలు పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో కూడా తెలుగుదేశం పార్టీ మళ్లీ పూర్వవైభవం సాధించి అధికారంలోకి వస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మైపా బాలరాజు, శ్యామ్ తివారీ, బాబు, దగ్గుల లింగయ్య, వేల్పుల ప్రశాంతి, కంది రవి, దాసరి గోపాలకృష్ణ, వాసం వినీత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మానుకోట ప్రతిఘటన భావితరాలకు స్ఫూర్తిదాయకం: శంతన్ రామరాజు

మహబూబాబాద్ మే 28 (జన సంఘర్షణ)

శంతన్ రామరాజు ఆధ్వర్యంలో మహబూబాబాద్ (మానుకోట) రైల్వేస్టేషన్‌లో మానుకోట ప్రతిఘటన జరిగి పదహారేండ్లు పూర్తయిన సందర్భంగా నాటి ఘటనను స్మరిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ మానుకోట రాళ్లను ప్రదర్శించి, అమరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు.
మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన మానుకోట ఘటన ప్రపంచ ఉద్యమాల చరిత్రలోనే ఒక మైలురాయి వంటిదని తెలంగాణ ఉద్యమ నేత శంతన్ రామరాజు కొనియాడారు. ఓదార్పు యాత్ర ముసుగులో వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలంగాణ భూమిపై అడుగుపెట్టాలని చూసినప్పుడు, మానుకోట రాళ్లే ఆయనకు గుణపాఠం నేర్పాయని స్పష్టం చేశారు. సీమాంధ్ర పెత్తందారీ రుబాబును తరిమికొట్టేందుకు ఊరూ, వాడా ఉప్పెనై ఎగసిపడ్డాయని, రక్తపు ముగ్గులు పోసి తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నామని శంతన్ రామరాజు గుర్తుచేశారు. మొత్తం తెలంగాణ ఉద్యమ చరిత్ర ఒక ఎత్తైతే, మహిమగల మానుకోట రాళ్ళ ప్రతిఘటన చరిత్ర మరో ఎత్తని ఆయన అభివర్ణించారు. అయితే, ఇంతటి ఘన చరిత్ర కలిగిన తెలంగాణను సాధించుకున్న తర్వాత కూడా నాటి ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని శంతన్ రామరాజు ఆవేదన వ్యక్తం చేశారు. నాడు ఉద్యమాన్ని అణచివేసిన వారు, ఉద్యమకారులను హింసించిన వారు నేడు పదవులు అనుభవిస్తుంటే, నిజమైన ఉద్యమకారులు మాత్రం ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని మండిపడ్డారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యమకారులను గుర్తిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వడం




సంతోషకరమే అయినప్పటికీ, ఆ హామీల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని శంతన్ రామరాజు విమర్శించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు, సహాయం అందకపోవడం వల్లే ఎందరో ఉద్యమకారులు కళ్లముందే అసువులు బాస్తున్నారని ఆవేదన చెందారు. గుంజె హన్మంతు, బాధరబోయిన రాఘవులు, తూము వెంకన్న, భూక్య సత్యనారాయణ, ముత్తుదొర వంటి ఎందరో వీరులు ప్రభుత్వం నుండి తగిన గుర్తింపు లేకనే మరణించారని శంతన్ రామరాజు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తన పనులను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి తెలంగాణ ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు, ప్రతి నెలా గౌరవ భృతిని ఏర్పాటు చేయాలని శంతన్ రామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన మానుకోట ప్రాంతానికి కూడా ఉద్యమకారుల కమిటీలో తగిన స్థానం కల్పించాలని ఆయన కోరారు. భవిష్యత్తులో తెలంగాణ వైపు కన్నెత్తి చూసే శక్తులకు మానుకోట రాళ్లే సమాధానం చెబుతాయని శంతన్ రామరాజు హెచ్చరించారు. విప్లవాల కోట అయిన మానుకోట ఉద్యమ జ్వాల, పీడిత ప్రజల గొంతుకై సూర్యచంద్రులు ఉన్నంత కాలం విరాజిల్లుతూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# స్కూల్ దారిలో ఇనుప కంచె రగడ

- ఇల్లందులో ఇరువర్గాల మధ్య ముదిరిన వివాదం
- 33 ఏళ్ల నాటి రహదారి మూసివేతపై మాంటిస్సోరి యాజమాన్యం ఆవేదన: చట్టప్రకారమేనన్న వ్యాపారి
- పట్టా భూమి నాదంటే నాది.. మాంటిస్సోరి స్కూల్ దారి వివాదంలో ముదిరిన ఉత్కంఠ
- మాంటిస్సోరి స్కూల్ ఎదుట హైడ్రామా: కంచె వేసిన వ్యాపారి.. తొలగించిన సిబ్బంది



ఇల్లందు మే 28 (జన సంఘర్షణ)

ఇల్లందు పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థగా ఎంతో గుర్తింపు పొందిన మాంటిస్సోరి పాఠశాల రహదారి వివాదం గురువారం నాడూ మరింత ముదిరి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాలకు వెళ్లే ప్రధాన మార్గంలో ఇనుప కంచె వేయడం పట్టణంలో కలకలం రేపింది. పాఠశాలకు వెళ్లే ముఖ్యమైన దారిలో స్థానిక వ్యాపారి అభిమన్యు ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. అయితే ఆ తర్వాత పాఠశాల సిబ్బంది దాన్ని తొలగించడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వివాదం చెలరేగింది. ఈ ఘటనతో పాఠశాల పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు వర్గాల వారు రోడ్డుపైకి రావడంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియక స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పాఠశాల సమీపంలోని సదరు వివాదాస్పద స్థలం తమ కుటుంబానికి చెందిన పూర్తి పట్టా భూమి అని వ్యాపారి అభిమన్యు బలంగా వాదిస్తున్నారు. ఆ స్థలంపై తమకే సర్వహక్కులు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. తమ కుటుంబానికి చెందిన భూమికి సంబంధించిన అన్ని రకాల అసలు పత్రాలు, చట్టపరమైన ఆధారాలు తమ వద్ద భద్రంగా ఉన్నాయని అభిమన్యు ఈ సందర్భంగా మీడియాకు వెల్లడించారు. తమ పట్టా భూమిని ఆక్రమించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, గతంలో కంచె వేసినా పట్టించుకోకపోవడం వల్లే ఇప్పుడు మళ్లీ ఇనుప కంచెతో సరిహద్దు ఏర్పాటు చేశామని అభిమన్యు పేర్కొన్నారు. "మా స్థలాన్ని ఇంతకాలం పాఠశాల వారు వాడుకుంటున్నా మానవతా దృక్పథంతో సహకరించాం. కానీ ఇప్పుడు మా సొంత భూమిని కాపాడుకోవాల్సిన అత్యవసర




పరిస్థితి వచ్చింది" అని ఆయన అన్నారు. ఈ స్థల వివాదం మరియు రహదారి అంశంపై తాము పూర్తిగా చట్టప్రకారమే ముందుకు వెళ్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ తమ భూమిని వదులుకునే ప్రసక్తే లేదని వ్యాపారి అభిమన్యు స్పష్టం చేశారు. మరోవైపు మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యం మాత్రం ఈ రహదారి మూసివేతపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న దారిని మూసివేయడం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందింది. గత 33 సంవత్సరాలుగా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఇదే మార్గంలో వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది రాకపోకలు సాగిస్తున్నారని పాఠశాల ప్రిన్సిపల్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇన్నేళ్లుగా లేని అభ్యంతరాలు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయని, అకస్మాత్తుగా చిన్న పిల్లలు వచ్చే రహదారిని ఇనుప కంచెతో ఎలా మూసివేస్తారని పాఠశాల యాజమాన్యం తీవ్రంగా ప్రశ్నించింది. దారి మూసివేయడంతో ఉదయం వేళల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అందుకే ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి కంచెను తొలగించాల్సి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఈ వివాదం పట్టణంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# భద్రాచల రామయ్యకు పట్టు వస్త్రాల సమర్పణ

ఇల్లందు మే 28 (జన సంఘర్షణ)



భద్రాచలం: భగవద్గీత ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ మాత గ్రూప్ సభ్యులు ఇల్లందు నుండి భద్రాచలం పుణ్యక్షేత్రానికి చేరుకుని, సీతా సమేత కోదండ రాముడికి, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్లకు ఘనంగా పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రార్థన శ్లోకం, సంకట నాశన గణేశ స్తోత్రం, గణపతి తాళం, విష్ణు షట్పతి, అచ్యుతాష్టకం, కాలభైరవాష్టకం, హనుమాన్ చాలీసాలతో పాటు మంగళ హారతులు పఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో "జైశ్రీరామ్", "జై గీత" నామస్మరణలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో విలసిల్లాయి.

# ఇల్లందు ఈద్గాలో ఘనంగా బక్రీద్ వేడుకలు

- ఎమ్మెల్యే కోరం కనకయ్యకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎండి ఇబ్రహీం

ఇల్లందు మే 28 (జన సంఘర్షణ)





త్యాగానికి, భక్తికి ప్రతీక అయిన బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పండుగ వేడుకలు ఇల్లందు పట్టణంలోని ఈద్గా మైదానంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి. ముస్లిం సోదరులంతా ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) నిర్వహించి, దేశంలో శాంతిసౌభాగ్యాలు విలసిల్లాలని దువా చేశారు. ఒకరికొకరు 'ఈద్ ముబారక్' చెప్పుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. ఈ వేడుకల్లో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, మాజీ టౌన్ ప్రెసిడెంట్ దొడ్డ డానియల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి ఇబ్రహీం ఈద్గా మైదానంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యకి, దొడ్డ డానియల్‌కి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సమాజంలో సోదరభావాన్ని, త్యాగనిరతిని పెంపొందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# లకారం ట్యాంక్ బండ్ వద్ద ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

- ఘన నివాళులర్పించిన ప్రముఖులు




ఖమ్మం మే 28 (జన సంఘర్షణ)

ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్ వద్ద మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లకారం ట్యాంక్ బండ్‌పై ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ప్రముఖ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన మహానాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం నాడు ఆయన ప్రవేశపెట్టిన అనేక పథకాలు చరిత్రలో నిలిచిపోయాయని గుర్తుచేశారు. రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఎన్టీఆర్ సమాజానికి చేసిన సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ జయంతి వేడుకల కార్యక్రమంలో ఖమ్మం నగర ప్రముఖులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నందమూరి తారక రామారావుకి ఘనంగా నివాళులర్పించారు.

# మోపాల్ మండలం సిర్పూర్ అటవీ శివారులో చిరుత సంచారం


మోపాల్ మండలం/మే28/జన సంఘర్షణ)



మోపాల్ మండలంలోని సిర్పూర్ అటవీ ప్రాంత శివారులో చిరుత సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు ధ్రువీకరించారు. చిరుత సంచరిస్తోందని గత వారం రోజులుగా గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఈ నేప థ్యంలో ఫారెస్ట్ అధికారులు సబ్ స్టేషన్ వద్ద రైతు నాగేష్ కి చెందిన డెయిరీ ఫామ్ సీసీ ఫుటేజీని పరిశీలించి చిరుత కదలికలను గుర్తించారు. వారం రోజుల వ్యవధిలో అర్ధరా త్రి సమయంలో చిరుత రెండుసార్లు వచ్చిందన్నారు. అటవీ ప్రాంతానికి ప్రజలు, రైతు లు వెళ్లొద్దని, జాగ్రత్తగా ఉండాలని ముదక్ పల్లి సెక్షన్ అధికారి బాసిత్ సూచించారు.

# దేశవ్యాప్తంగా బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్న ముస్లిం సోదరులు

హైదరాబాద్/మే28/(జన సంఘర్షణ)



దేశం వ్యాప్తంగా బక్రీద్ పండుగ భక్తిశ్రద్ధలతో జరుపుకున్న ముస్లిం సోదరులు. ఉదయం ఈదిగ, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. హైదరాబాద్, ఢిల్లీ, భోపాల్, ఉత్తప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బెంగళూరు, ప్రధాన పట్టణాల్లో ముస్లిం సోదరులు మసీదులలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈదిగా వద్ద ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు జరిపారు. భోపాల్ లో బక్రీద్ సందేశాన్ని వివరించిన మత గురువు. పల్లె మొదలుకొని పట్టణ వరకు ముస్లిం సోదరులు ఆనంద ఉత్సవాల మధ్య బక్రీద్ పండుగను జరుపుకున్నారు. ప్రార్థనలు అనంతరం ఒకరినొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జన సంఘర్షణ
తెలుగు దినపత్రిక
శుక్రవారం 29 మే 2026

# కాంగ్రెస్ చేతగానితనంతోనే పూసపల్లి ఓసి నిర్మాణంలో జాప్యం

- బిఆర్ఎస్ ఆగ్రహం
- టికెట్ దక్కక మతిభ్రమించే గోచికొండ సత్యనారాయణ ప్రెస్ మీట్లు: బిఆర్ఎస్ ఎద్దేవా
- ఆనాడు కేసీఆర్ సింగరేణిని పునరుద్ధరిస్తే... ఈనాడు కాంగ్రెస్ కార్మికులను తరిమేస్తోంది
- ఇల్లందు మనుగడను ప్రశ్నార్థకంగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం: బిఆర్ఎస్ నిప్పులు
- కాంగ్రెస్ చేతగానితనంతోనే పూసపల్లి ఓసి నిర్మాణంలో జాప్యం: బిఆర్ఎస్ నేత కాసాని హరిప్రసాద్ ధ్వజం

కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితన స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబ స్వార్థం వల్లే పూసపల్లి ఓసి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఇల్లందు నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లందు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్‌లో బిఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు సిలివెరి సత్యనారాయణ, మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్లుతో కలిసి బిఆర్ఎస్ యువజన, సోషల్ మీడియా ముఖ్య నాయకులు కాసాని హరిప్రసాద్ కాంగ్రెస్ వైఫల్యాలపై గళమెత్తారు. ఈ సందర్భంగా కాసాని హరిప్రసాద్ మాట్లాడుతూ, జెకె-05 ఓసిని పునరుద్ధరించకుండా ఇక్కడి కార్మికులను వివిధ ప్రాంతాలకు తరలిస్తూ, సింగరేణి పుట్టినిల్లైన ఇల్లందు మనుగడను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నార్థకంగా మార్చిందని మండిపడ్డారు. పూసపల్లి ఓసి నిర్మాణం ఆగిపోవడానికి ఎన్విరాన్మెంటల్ అనుమతులు లేకపోవడం కారణం కాదని, కేవలం ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న భూములకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సెటిల్మెంట్ కాకపోవడమేనని కాసాని హరిప్రసాద్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఆయన భార్య లక్ష్మి, సోదరుడు సురేందర్, ఉమల పేర్ల మీద ఉన్న రాయించిన భూముల స్వార్థం కోసమే ఇల్లందు భవిష్యత్తును పణంగా పెడుతున్నారని, దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కాసాని హరిప్రసాద్ వెల్లడించారు. పూసపల్లి ఓసిలో కాంగ్రెస్ నాయకులు స్వతహాగా సర్వే చేయించుకున్న 100 ఎకరాల ల్యాండ్‌లో ఒక్క గజం తక్కువ ఉన్నా రాజీనామా చేసే ధైర్యం ఎమ్మెల్యే కనకయ్యకు ఉందా? అని కాసాని హరిప్రసాద్ సవాల్ విసిరారు. ఊరి చివర ఉన్న గుట్టలను సైతం వదలకుండా సర్వే చేయించుకుని పట్టాలు చేయించుకున్న ఘనత కాంగ్రెస్ ఎమ్మెల్యేదేనని, ఆ భూములు ప్యాకేజీ పరిధిలోకి రాకపోవడం వల్లే ఓసి నిర్మాణంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని కాసాని హరిప్రసాద్ దుయ్యబట్టారు. గతంలో జెకె-05 ఓసి మూతపడే తరుణంలో, ఇల్లందు మనుగడను దృష్టిలో ఉంచుకుని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వాటిని పునరుద్ధరించిన ఘనత కేవలం బిఆర్ఎస్ (టిఆర్ఎస్) పార్టీదేనని ఐఎన్టియుసి నాయకులు గుర్తుంచుకోవాలని కాసాని హరిప్రసాద్ హితవు పలికారు.

మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్‌ని విమర్శించే అర్హత గోచికొండ సత్యనారాయణకు, జే. వెంకటేశ్వర్లుకు లేదని.. హరిప్రియ చేసిన అభివృద్ధి నేడు నిర్మితమవుతున్న 100 పడకల ఆసుపత్రి, డయాలసిస్ సెంటర్ రూపంలో స్పష్టంగా కనిపిస్తోందని కాసాని హరిప్రసాద్ పేర్కొన్నారు. ఇల్లందు ప్రజల చిరకాల వాంఛ అయిన బస్ డిపో, నిత్యం వేలాది మంది ప్రయాణించే ప్రధాన రహదారిని హరిప్రియ నాయక్ గారే నిర్మించారని, కళ్లు ఉండి కూడా కాంగ్రెస్ నాయకులు ఈ అభివృద్ధిని చూడలేకపోతున్నారని కాసాని హరిప్రసాద్ ఎద్దేవా చేశారు. గోచికొండ సత్యనారాయణ ఇల్లందు నుండి ఎందుకు బదిలీ అయ్యారో, జే. వెంకటేశ్వర్లుపై ఉన్న అక్రమ కేసుల సంగతి ఏంటో తమకు బాగా తెలుసని, ఇంకొకసారి బిఆర్ఎస్ పై అవాకులు చవాకులు పేలితే ఆధారాలతో



సహా బయటపెడతామని కాసాని హరిప్రసాద్ హెచ్చరించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో రెండు వార్డుల్లో టికెట్ ఆశించి భంగపడి, మతిభ్రమించిన గోచికొండ సత్యనారాయణ.. కేవలం తన ఉనికిని కాపాడుకోవడానికే హంగు ఆర్భాటాలతో ప్రెస్ మీట్లు పెడుతున్నారని కాసాని హరిప్రసాద్ ఎద్దేవా చేశారు. టేకులపల్లి హాస్పిటల్, సింగరేణి క్వార్టర్స్ నిర్మాణానికి ముందే అక్కడ హౌసింగ్ భూములు ఉండేవని, దానికి సంబంధించిన సర్టిఫికెట్లు నేటికీ ఆధారాలుగా ఉన్నాయని, పూసపల్లి ఓసిని పునరుద్ధరించిన తర్వాతే కాంగ్రెస్ నాయకులకు మాట్లాడే హక్కు ఉంటుందని కాసాని హరిప్రసాద్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్ హయాంలో మూతబడిన 30 పడకల ఆసుపత్రిని ఆధునికీకరించి గైనకాలజిస్ట్‌ను ఏర్పాటు చేసి, గర్భిణీలకు టిఫా స్కానింగ్, శస్త్రచికిత్సలు అందుబాటులోకి తెస్తే.. నేడు కనీసం టిఫా స్కానింగ్ కూడా లేని దరిద్ర పాలనను కాంగ్రెస్ అందిస్తోందని కాసాని హరిప్రసాద్ ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఇల్లందు అభివృద్ధి గురించి మాట్లాడుకుంటూ పోతే కాంగ్రెస్ నాయకులు ఇల్లందులో తిరగడానికి మొహం కూడా ఉండదని హెచ్చరించిన ఈ కార్యక్రమంలో కాసాని హరిప్రసాద్‌తో పాటు యువజన, సోషల్ మీడియా నాయకులు గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ, షేక్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.


# మూగజీవాల సేవలో రజక, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాసరావు

- అనాథ పిల్లలకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ: కంచర్ల శ్రీనివాసరావు అద్భుతమైన సేవా నిరతి
- 30 ఏళ్ల విదేశీ అనుభవంతో అనాథలకు ఉచిత శిక్షణ: ఇల్లందులో కంచర్ల వినూత్న సేవ
- ఇల్లందు ప్రయోజనాలే ధ్యేయం: రైల్వే స్టేషన్ సాధనకై పోరాటానికి సై అంటున్న కంచర్ల
- గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి

ఇల్లందు మే 28 (జన సంఘర్షణ)

అడవిలో ఆహారం లేక అల్లాడుతున్న కోతులకు స్వహస్తాలతో పండ్లు, ఆహారం అందిస్తూ సమాజంలో మూగజీవాల పట్ల తనకున్న అపారమైన ప్రేమను చాటుకున్నారు రజక, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాసరావు. ఎండ తీవ్రతకు అల్లాడుతున్న పశువులు, పక్షులకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆహారం, తాగునీరు అందించి ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రజక, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. హిందువుల ఆరాధ్యదైవమైన గోమాతను కేంద్ర ప్రభుత్వం తక్షణమే 'జాతీయ జంతువు'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆవుల సంరక్షణ విషయంలో కేంద్రం ఇకనైనా తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు.





### ఇల్లందు అభివృద్ధి - ప్రజా పోరాటాలు

ఇల్లందు ప్రాంత ప్రయోజనాలే పరమావధిగా భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రజాపోరాటాలు చేసేందుకు రజక, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాసరావు సిద్ధమవుతున్నారు. ఇల్లందు నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి కోసం తాను నిరంతరం ప్రజాపక్షాన నిలబడతానని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఇల్లందు రైల్వే స్టేషన్ పునరుద్ధరణ, ఆధునీకరణ కోసం రానున్న రోజుల్లో అవసరమైతే తాను నిరాహార దీక్ష చేయడానికి కూడా వెనుకాడబోనని, దీనికి సంబంధించి ఇప్పటికే పూర్తి స్థాయి కార్యాచరణతో ఆలోచన చేస్తున్నానని రజక, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాసరావు ప్రకటించారు.

### అనాథ యువతకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

కేవలం సామాజిక సేవకే పరిమితం కాకుండా, సమాజంలో వెనుకబడిన అర్హులైన అనాథ యువతీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇచ్చేందుకు రజక, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాసరావు గొప్ప సంకల్పంతో అడుగులు వేశారు. ఈ అద్భుతమైన సువర్ణ అవకాశాన్ని అనాథ యువత అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత డ్రైవింగ్ శిక్షణ పొందాలనుకునే అనాథ యువతీ యువకులు మరిన్ని వివరాల కోసం రజక, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాసరావు వ్యక్తిగత మొబైల్ నెంబర్ 98493 78766 లో నేరుగా సంప్రదించవచ్చని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### కంచర్ల శ్రీనివాసరావు అనుభవం

రజక, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాసరావుకి డ్రైవింగ్ రంగంలో అపారమైన అంతర్జాతీయ అనుభవం ఉంది. గతంలో ఆయన విదేశాలలో దాదాపు 30 సంవత్సరాల పాటు సుదీర్ఘ కాలం పాటు డ్రైవింగ్ రంగంలో సేవలందించి ఎనలేని గుర్తింపు తెచ్చుకున్నారు. విదేశాల్లో గడించిన ఆ సుదీర్ఘ అనుభవంతో ఇప్పటికే కొన్ని వందల మందికి డ్రైవింగ్‌లో పక్కాగా శిక్షణ ఇవ్వడమే కాకుండా, రోడ్డు భద్రతా నియమాలు, డ్రైవింగ్‌లోని కీలక మెలుకువలను నేర్పించి ఎందరినో ఉత్తమ డ్రైవర్లుగా తీర్చిదిద్దిన ఘనత రజక, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాసరావుకి దక్కుతుందని స్థానికులు కొనియాడారు.

# బడుగు బలహీన వర్గాల యుగపురుషుడు ఎన్టీఆర్

- కోడూరి సుబ్బారావు.

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 28 (జన సంఘర్షణ):

తెలుగు జాతికి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన మహానేత, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక స్వర్గీయ నందమూరి తారక రామారావు అని ప్రముఖ సంఘ సేవకులు, వసంత్‌నగర్ కాలనీ వాసి కోడూరి సుబ్బారావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కాలనీవాసులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ తెలుగు ప్రజల గౌరవాన్ని తదేశవ్యాప్తంగా చాటిన మహోన్నత వ్యక్తిత్వం ఎన్టీఆర్‌ని కొనియాడారు. పేదల సంక్షేమం, మహిళల సాధికారత, సామాన్య ప్రజల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేపట్టిన పథకాలు ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. రాజకీయాల్లో ప్రజాసేవకు కొత్త నిర్వచనం ఇచ్చిన నాయకుడిగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ఎన్టీఆర్ చేసిన సేవలు మరువలేనివని, ఆయన చూపిన మార్గంలో నేటి నాయకులు నడవాలని సూచించారు. అలాగే, నేటి రాజకీయ నాయకులు ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకొని సేవాభావంతో పనిచేయాలని సుబ్బారావు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుంటే సమాజంలో మరింత సానుకూల మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు.



ఈ కార్యక్రమంలో వసంత్‌నగర్ కాలనీ అధ్యక్షుడు ఎర్ర నాగేశ్వరరావు, సత్యనారాయణ, శోభన్ బాబు, సురేష్ బాబు, తేజ, రాజశేఖర్, యశ్వంత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదర, సోదరీమణులందరికీ పవిత్ర బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

- శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, మే 28 (జన సంఘర్షణ):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు.ఈ పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాతృశ్రీ నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్, భిక్షపతి నగర్ ఈద్గా నందు నిర్వహించిన ప్రార్థనలో పాల్గొని ప్రజలకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ స్వరాష్ట్రంలో పేద ముస్లింలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, అన్ని కులాలు, మతాలను సమానభావంతో చూస్తున్న సెక్యులర్ నాయకుడు సీఎం ఏ.రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు.



# నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఐపీఎస్ పర్యటన

- ఈద్గాల ను సందర్శించిన సీపీ సాయి చైతన్య


బోధన్/మే 28/(జన సంఘర్షణ)

బోధన్: పట్టణంలోని నర్సి రోడ్డులో గల ఈద్గాలను జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య గురువారం సందర్శించారు. బక్రీద్ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తుపై ఆరాతీశారు. ఎలాంటి అవంచానియా ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బందోబస్త్ ఏర్పాటుపై అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అసౌకర్యం కల్పించకుండా చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాల పనితీరుపై సైతం ఆరాతీశారు. అనుమాస్పద వ్యక్తులు కనిపించిన వివాదాలు చెలరేపే వ్యక్తులు కనిపించిన పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంటఅడిషనల్ డిసిపీ శుభం ప్రకాష్, ఏసీపీ శ్రీనివాస్, ఎస్ హెచ్ వో వెంకట్ నారాయణ్, సీఐ లు, ఎస్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బేరి రామచందర్ యాదవ్

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, మే 28 (జన సంఘర్షణ):



శేరిలింగంపల్లి బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ఇంచార్జ్ మారబోయిన రవి యాదవ్ కి బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారబోయిన రవి యాదవ్ మునుముందు ఉన్నత పదవులు రావాలని మనస్ఫూర్తిగా భగవంతుని వేడుకొంటూ రవి యాదవ్ యువతరం రాజకీయంలోకి రావాలి మంచి పరిపాలన అందించాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ బహుజనులకు రాజ్యాధికార ఫలాలు అందాలని అన్నారు భేరి రామచంద్ర యాదవ్. యువతకు రాజకీయలో ముందుకు రాణించాలని నేటి సమాజంలో యువత మంచి ఆలోచన తోటి మంచి రాజకీయంతో పేద మధ్య తరగతి బడుగు బలహీన వర్గాలకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, గోపి నగర్ బిసి నాయకులు నరసింహ గౌడ్ వెంకటేష్ మేస్త్రి, సందీప్ యాదవ్, రాజు గౌడ్, మేదరి మహేంద్ర సంఘం వెంకట్, గోపాల్ యాదవ్, రాజు యాదవ్, కిరణ్ ముదిరాజ్, శేరిలింగంపల్లి డివిజన్‌లో ప్రజా ప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని మారిపోయిన రవికుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# హైదరాబాద్లోని మైత్రివనం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం

- ఆవిష్కరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్/మే 28/(జన సంఘర్షణ)



సినీ రంగంలో నుంచి రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి 6 నెలల్లోనే పార్టీ పెట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాం నందమూరి తారక రామారావు 103 జయంతి సందర్భంగా హైదరాబాద్ మైత్రివనం కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహావష్కరణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. మైత్రివనం పరిసరాలన్నీ ఎన్టీఆర్ కటౌట్లు, బ్యానర్లతో పసుపు వర్ణం గా నిలిచిపోయింది. ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రముఖులు అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అజారుద్దీన్, తుమ్మల నాగేశ్వరరావు, మాండవ వెంకటేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఎన్టీఆర్ కుమారులు మోహన్ కృష్ణ రామకృష్ణ , సినిమా ప్రముఖులు పాల్గొన్నారు.

## నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు

- ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్.

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, మే 28 (జన సంఘర్షణ):



విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) 103వ జయంతిని పురస్కరించుకుని దీప్తి శ్రీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన్నానంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు, ప్రజలు, మహిళలు తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 103 జయంతి వేడుకలు

- ఎన్టీఆర్ ఘాటు వద్ద నివాళులర్పించిన భువనేశ్వరి, జూనియర్ ఎన్టీఆర్. ప్రముఖులు

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల/మే 28/(జన సంఘర్షణ)



సినీ రంగంలో నుంచి రాజకీయ పార్టీ పెట్టి ఆరు నెలల్లోనే తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు 103 జయంతి వేడుకలు ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఘనంగా జరుపుకున్నారు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు ఘాటు వద్ద సమాధి వద్ద నివాళులు అర్పించారు. నారా భువనేశ్వరి, జూనియర్ ఎన్టీఆర్, రాజేంద్రప్రసాద్, ప్రముఖులు ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకొని ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. తెలుగు రాష్ట్రాలకు నందమూరి తారకరామారావు ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ పనులు చేపట్టిన ఘనత తారక రామారావు కె దక్కుతుందని తెలుగుదేశం శ్రేణులు వెల్లడించారు. 1984 లోనే నిరుపేదలకు కడుపు నింపాలనే ఉద్దేశంతో రెండు రూపాయలు కిలో బియ్యం ఇచ్చిన ఘనత ఎన్టీఆర్కే దక్కిందని తెలుగుదేశం ప్రముఖులు వెల్లడించారు. రాజకీయంలో చైతన్యం తీసుకువచ్చింది ఎన్టీఆర్ అని వారు గుర్తు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ పేరు గుర్తులేని వారు లేరు అని ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. బోధన్, నిజామాబాద్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, రెంజల్, నవీపేట్, సిద్దిపేట్,, మెదక్, సంగారెడ్డి, బాన్సువాడ, బీర్కూర్, తిమ్మాపూర్, నర్సిల్లాబాద్, గ్రామాలలో ఎన్టీఆర్ చిత్రపటాన్ని పెట్టి నివాళులర్పించారు. ఆయన రెండు రాష్ట్రాలకు చేసిన సేవలను గుర్తు చేశారు.

## నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు

- ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించిన బండి రమేష్.



హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 28 (జన సంఘర్షణ):

తెలుగుజాతి పౌరుషాన్ని దశ దిశలా వ్యాపింపజేసిన నందమూరి తారక రామారావు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం అని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు 103వ జయంతి వేడుకలను గురువారం వీధి వీధిన వాడవాడలా ఆయన అభిమానులు పార్టీ కార్యకర్తలు తోపాటు కాంగ్రెస్ నాయకులు సైతం ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ లు ద్విచక్ర వాహన ర్యాలీలు, రక్తదానాలు, అన్నదానాలు గొప్పగా నిర్వహించారు. కెపిహెచ్బి కాలనీ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని బండి రమేష్ సందర్శించారు. ఈ శిబిరం నిర్వాహకుడు వెంకట్రావుని రమేష్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు గరికపాటి రామ్మోహన్ రావు కూడా హాజరయ్యారు .వసంత నగర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి రమేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఇక్కడ కార్యక్రమానికి వేలాది మంది తెలుగుదేశం పార్టీ అభిమానులు హాజరయ్యారు. అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి నగర్ తో పాటు ఎన్టీఆర్ ఘాట్ వద్ద జరిగిన ఎన్టీఆర్ జయంతి కార్యక్రమానికి బండి రమేష్ హాజరై ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఆకులో ఆసునై.. జీవితాలతో జూద మాట.. నవీపేట్ మండల్లో జోరుగా పేకాట

- నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలో జోరుగా పేకాట.
- కుటుంబాలను రోడ్డున పడేస్తున్న నిర్వాహకులు.
- ఆకులో ఆసునై.. జీవితాలతో జూద మాట..

నవీపేట్ మండల్/మే28/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా: నవీపేట్ మండల్లోని పలు అటవి ప్రాంతాల్లో జోరుగా పేకాట కొనసాగుతుంది. మండలంలోని ఫకిరాబాద్, యంచా, నందిగావ్, అల్జపూర్, పోతంగల్ శివార్లలో జోరుగా పేకాట కొనసాగుతున్నట్లు విమర్శలు తలెత్తుతున్నాయి. ప్రత్యేక ఏజెంట్లు నిర్వహించి పేకాట స్థావరాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నట్లు. పేకాట మూలంగా అనేక కుటుంబాల్లో వివాదాలు చెలరేగడంతో పాటు సంసారాలు రోడ్డున పడుతున్నాయి. పేకాట అంగీర్వాకులు పేకాటరాయుళ్ల కోసం ఈ ఈ ప్రాంతంలో ఉన్న గుట్టల వైపు ప్రత్యేక నిఘ ను ఏర్పాటు చేసుకుని మూడు ఆకులు ఆరు ముక్కలుగా పుష్కలంగా పేకాట కొనసాగుతోంది. నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్న ఏజెంట్లకు రోజుకు రూ. 1500 కూలి చెల్లించడంతోపాటు మద్యం బిర్యాని సైతం వసతులు కల్పిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. నిర్వాహకులు పేకాట రాయుళ్లకు సైతం మందు విందు తోపాటు ప్రత్యేక



వాహనాల సదుపాయాన్ని కల్పిస్తూ వారి కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నారు. పేకాట నిర్వాహకులకు పోలీసులు సైతం ఏజెంట్లుగా ఉన్నట్లు విమర్శలు తలెత్తుతున్నాయి. ఎవరైనా కొత్త వ్యక్తులు అటువైపు వెళ్ళినట్లయితే వాళ్ళు ఏర్పాటు చేసుకున్న ఏజెంట్లు ముందస్తు సమాచారం పేకాటనిర్వాకులకు పేకాటరాయుళ్లను ఆ ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలిస్తున్నట్లు స్పష్టమవుతుంది.

**లక్షల్లో చేతులు మారుతున్న డబ్బులు:** పేకాట స్థావరం వద్ద లక్షల్లో చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. 1000 కి 2000 చొప్పున డబ్బులు కట్ చేసుకొని పేకాట ఆడేవారికి పేకాట స్థావరం వద్ద డబ్బులు ఇస్తూ పేకాటను కొనసాగిస్తున్నారని ఆయా ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

**విచ్చిన మౌతున్న కుటుంబాలు:** పేకాటలో డబ్బులు పోగొట్టుకున్న పేకాట రాయులు ఇల్లల్లోకి వెళ్లి తల్లిదండ్రులు, భార్య కుటుంబాల్లో గొడవలు పెట్టుకుని హత్యలు, ఆత్మహత్యల సైతం పాల్పడుతున్నారు. మంగళ సూత్రాలు తాకట్టుపెట్టి పేకాటలో పాల్గొనేందుకు భార్యల మెడలో బంగారు ఆభరణాలు మంగళ సూత్రాలను సైతం పేకాట స్థావరం వద్దని తాకట్టు పెట్టి పేకాట ఆడుతున్నారు. మరికొందరు పట్టా భూములు ప్లాట్ల డాక్యుమెంట్లు వాహనాలను సైతం తాకట్టు పెట్టి ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. పోలీసు శాఖలో సైతం రూపొందించే వారు ఉన్నట్లు పలు ఆరోపణ వెలువెత్తుతున్నాయి. తాము ప్రతి ఒక్కరికి ముడుపులు ముట్టజెప్పి తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నామని ఎవరికి జంకాల్సిన అవసరం లేదంటూ పేకాటనిర్వాకుడు బాహాటంగా చెప్పినట్లు విమర్శలు సైతం ఉన్నాయి. అటు పోలీసులకు ఇటు పేకాట నిర్వాహకులకు ఏజెంట్ గా ఓ సోషల్ మీడియా నిర్వాకుడు పనిచేస్తున్నట్లు ఘాటుగా విమర్శలు తలెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో పనిచేస్తున్న సదరు వ్యక్తి సైతం ఈ పేకాట స్థావరాలను తానే స్వయంగా ఏర్పాటు చేస్తున్నట్లు మండలంలో కోడైకూ స్తున్నారు.

## రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిది

- మీరు నిర్మిస్తున్న భవనాలే తెలంగాణ భవిష్యత్తుకు పునాది రాళ్లు.
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 28 (జన సంఘర్షణ):


నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు, వార్షిక సర్వసభ్య సమావేశం సంధ్య కన్వెన్షన్ గచ్చిబౌలిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఈ పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, సావనీర్ పుస్తకాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, పురోగతిలో కీలక పాత్ర పోషించే రియల్ ఎస్టేట్ రంగానికి మద్దతునిచ్చి దానిని బలోపేతం చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సుదీర్ఘంగా 400 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందుతూవుంది. రాబోయే పదేళ్లలో హైదరాబాద్ను ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణ కొనసాగిస్తోందన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఫ్యూచర్ రెడీ ఇన్ఫ్రాస్ట్రక్చర్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, ఎఐ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి భారీ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని తెలిపారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం తెలంగాణ అభివృద్ధికి వెన్నెముకలాంటిని పేర్కొంటూ, ఆధునిక సాంకేతికత, నాణ్యత ప్రమాణాలు, పర్యావరణ హిత నిర్మాణాలపై బిల్డర్లు దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే స్థిరమైన మరియు స్మార్ట్ అర్బన్ డెవలప్మెంట్ పై దృష్టి పెట్టాలని కోరారు.హైదరాబాద్ను రాబోయే పదేళ్లలో ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మా ప్రభుత్వ లక్ష్యం కేవలం చరిత్ర సృష్టించడమే కాదు, కాలంతో పాటు దానిని మార్చడం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు మేము ఒక సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నాము అని అన్నారు. మీకు ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతాను.నావంతు సహాయ సహకారాలు ఎల్లపుడు మీకు ఉంటాయి అని అన్నారు.ఈ కార్యక్రమంలో నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు డా. సత్యం శ్రీరంగం, నర్రా నాగేశ్వర రావు, నారెడ్కో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ పూర్వ అధ్యక్షుడు హరి బాబు,




తెలంగాణ అధ్యక్షుడు కె. శ్రీధర్ రెడ్డి జనరల్ సెక్రటరీ ఆర్. వెంకటేశ్వర రావు, కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు కాళి ప్రసాద్, గోపాల కృష్ణ, ఉపాధ్యక్షుడు ఎం. ప్రేమ కుమార్, టీబీఎఫ్ అధ్యక్ష్యుడు సి.ప్రభాకర్ రావు, నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ వడ్డేపల్లి రంగ రావు, వైస్ చైర్మన్ బి. లక్ష్మీ నారాయణ, అధ్యక్షుడు కోటేశ్వర రావు, సలహాదారులు, నారెడ్కో జనరల్ సెక్రటరీ కె.వి. ప్రసాద రావు, ట్రెజరర్ సిహెచ్. రామ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు వేణుగోలు శ్రీనివాస రావు మరియు పెద్ద ఎత్తున బిల్డర్స్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫేక్ క్యాస్ట్ సర్టిఫికెట్‌తో టీచర్ ఉద్యోగం.. సర్టిఫికెట్లు రద్దు చేసిన మెదక్ జిల్లా కలెక్టర్!

మెదక్ జిల్లా,/మే 28/(జన సంఘర్షణ)





గురువుగా అవతారం ఎత్తాలంటే తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పెట్టి టీచర్గా అవుతారు ఓ మహిళ. చివరికి ఆమె పెట్టిన సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించగా అవన్నీ తప్పుడు ధృవపత్రాలని వెలుగు చూశాయి. ఈ విషయంలో కలెక్టర్ తప్పుడు ధృవ పత్రాలతో టీచర్ ఉద్యోగం చేస్తున్న ఆమె సర్టిఫికెట్లను రద్దు చేసిన మెదక్ జిల్లా కలెక్టర్. తప్పుడు ధృవీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించిన ఓ మహిళా టీచర్ వ్యవహారం మెదక్ జిల్లాలో సంచలనంగా మారింది. నకిలీ క్యాస్ట్ సర్టిఫికెట్, నాన్-క్రిమిలేయర్ సర్టిఫికెట్లను సమర్పించి ప్రభుత్వ ఉద్యోగం పొందినట్లు తేలడంతో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కీలక చర్యలు తీసుకున్నారు. సంబంధిత సర్టిఫికెట్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**అసలేం జరిగిందంటే..?**

2024 డీఎస్సీ నోటిఫికేషన్లో బీసీ-ఈ కేటగిరీ కింద ఐదు ఎస్జీటీ పోస్టులు కేటాయించబడ్డాయి. టేక్మాల్ మండలం తంపులూరు గ్రామానికి చెందిన దూదేకుల సనాబేగం అనే అభ్యర్థి బీసీ-ఈ క్యాస్ట్ సర్టిఫికెట్, నాన్-క్రిమిలేయర్ ధృవీకరణ పత్రాల ఆధారంగా టీచర్ ఉద్యోగాన్ని పొందారు. ప్రస్తుతం ఆమె అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

**ఫిర్యాదుతో బయటపడ్డ అసలు నిజం!**

సనాబేగం నిజానికి బీసీ-బి కేటగిరీకి చెందిన దూదేకుల సామాజిక వర్గానికి చెందినవారని, కానీ తప్పుడు మార్గంలో బీసీ-ఈ (షేక్ సామాజిక వర్గం) సర్టిఫికెట్ పొందారని పాపన్నపేట మండలానికి చెందిన మహమ్మద్ నవాజ్ అనే మరో అభ్యర్థి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆధారాలతో కూడిన ఫిర్యాదు అందడంతో అధికారులు విచారణ చేపట్టారు.

**కలెక్టర్ యాక్షన్..**

ఫిర్యాదుపై స్పందించిన రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ నిర్వహించారు. విచారణలో సనాబేగం సమర్పించిన క్యాస్ట్, నాన్-క్రిమిలేయర్ సర్టిఫికెట్లు తప్పుడు సమాచారం ఆధారంగా పొందినట్లు నిర్ధారణ కావడంతో, అధికారులు నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో స్పందించిన మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ర సంబంధిత సర్టిఫికెట్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అర్హులైన అభ్యర్థుల అవకాశాలను హరించి అక్రమంగా ఉద్యోగాలు పొందే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
శుక్రవారం
29 మే 2026

# కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా?

- ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్?
- గవర్నర్ అపాట్మెంట్ కోసం ఎదురుచూపులు



కర్ణాటక/మే28/( జన సంఘర్షణ)

కర్నాటక కాంగ్రెస్లో మార్పు మొదలైనట్లు కనిపిస్తోంది. సిద్ధరామయ్య తన సీఎం పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇవాళ బెంగుళూరులో ఆసక్తికర ఘటన చోటుచేసుకున్నది. సీఎం సిద్ధరామయ్యను ఆలింగనం చేసుకున్న డిప్యూటీ సీఎం శివకుమార్ ఆ తర్వాత పాదాభివందనం చేశారు. సిద్ధరామయ్య కాళ్లను మొక్కి డీకే శివ.. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. బ్రేక్ఫాస్ట్ మీటింగ్ సమయంలో ఈ ఘటన జరిగింది. ఇవాళ రాష్ట్ర గవర్నర్ థావర్చాంద్ గెహ్లోట్ అపాయింట్మెంట్ సిద్ధరామయ్య తీసుకున్నారు. బహుశా ఆయన తన రాజీనామాను గవర్నర్కు సమర్పించే అవకాశాలు ఉన్నాయి.గురువారం తన క్యాబినెట్ మిత్రులకు సీఎం సిద్ధరామయ్య అల్పాహార విందు ఏర్పాటు చేశారు. తన అధికార నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్తో ఆయన క్యాబినెట్ మిత్రులు కూడా బ్రేక్ఫాస్ట్ మీటింగు హాజరయ్యారు. శివకుమార్ను సీఎం సిద్ధరామయ్య హత్తుకున్నఇవాళ తన క్యాబినెట్ మిత్రులకు సీఎం సిద్ధరామయ్య అల్పాహార విందు ఏర్పాటు చేశారు. తన అధికార నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్తో పాటు ఆయన క్యాబినెట్ మిత్రులు కూడా బ్రేక్ఫాస్ట్ మీటింగ్న హాజరయ్యారు. శివకుమార్ను సీఎం సిద్ధరామయ్య హత్తుకున్న ఫోటోను సీఎంవో ఆఫీసు రిలీజ్ చేసింది. ఇక తర్వాత సిద్ధరామయ్య పాదాలను శివకుమార్ తాకారు. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఆదేశాల ప్రకారమే సీఎం సిద్ధరామయ్య తన పదవి నుంచి తప్పుకోనున్నట్లు తెలుస్తోంది.. ప్రస్తుతం గవర్నర్ సిటీలో లేరు. ఆయన తన వ్యక్తిగత పనుల కోసం ఇండోర్ వెళ్లినట్లు లోక్భవన్ వర్గాలు వెల్లడించాయి.

# కోటగిరిలో ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

- సంక్షేమ పథకాల సృష్టికర్త స్వర్గీయ నందమూరి తారక రామారావు
- ముఖ్య అతిథులు 1ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెల్లడి
- జనరల్ ఫంక్షన్ హాల్ (మిర్జాపూర్) ప్రారంభప్రారంభోత్సవం
- తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రియల్ చైర్మన్ కాసుల బాలరాజు

కోటగిరి/మే 28/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో గురువారం నటరత్న నటసార్వభౌమ ఎన్టీ రామారావు 103వ జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రజాస్వామ్య క్షేత్రంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన మొట్టమొదటి ముఖ్యమంత్రి,సంక్షేమ పథకాల సృష్టికర్త స్వర్గీయ నందమూరి తారక రామారావు అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు.తెలుగు రాష్ట్ర ప్రజల అభిమాన నాయకులు స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రియల్ చైర్మన్ కాసుల బాలరాజు పేర్కొన్నారు. గురువారం కోటగిరి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఎన్టీఆర్ అభిమాన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 జయంతి వేడుకలు అలాగే మండల కేంద్రంలోని మిర్జాపూర్ క్యాంప్ నందు నూతనంగా నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవ వేడుకలకు పోచారం శ్రీనివాస్ రెడ్డి,కాసుల బాలరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం మిర్జాపూర్ కాలనీలో కోటి రూపాయలతో నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్ కు ముఖ్య అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి,కాసుల బాలరాజు మాట్లాడుతూ.ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కోటగిరిలోనీ మిర్జాపూర్ కాలనీలో నూతనంగా నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్ ప్రారంభించుకోవడం అభినందనీయమని అన్నారు.ఈ జనరల్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకరించి స్థలదాత నిలిచిన కీర్తిశేషులు మిక్కిలినేని ప్రసాద్ రావు యొక్క కుటుంబ సభ్యులకు అలాగే ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం కృషిచేసిన దొప్పలపూడి శ్రీధర్,వేములపల్లి ఆనంద్ లకు కోటగిరి గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. నాటి రాజకీయ పరిణామాలకు చెల్లించి తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెడుతున్న ఢిల్లీ నాయకుల చర్యలకు విసిగిన ఎన్టీఆర్ 1982 లో టిడిపి పార్టీని స్థాపించి,అనతి కాలంలో అధికారంలోకి వచ్చి దేశ రాజకీయాలలో ఒక చరిత్రను సృష్టించిన మహానీయులు ఎన్టీఆర్ అని కొనియాడారు.దేశంలో ఎంతోమంది ప్రధాన మంత్రులతో పాటుగా రాష్ట్రాలలో ఎంతోమంది ముఖ్యమంత్రులు ప్రజలను పాలించారు.కానీ నిరుపేదలకు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన మొట్ట మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని కొనియాడారు. రోటీ,కపడ,మఖాన్ అనే నినాదంతో దేశ రాజకీయాలలో సంక్షేమ పథకాలకు ఆజ్యం పోసిన మహానీయులు ఎన్టీ ఆర్ అని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి పాలనలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయని.రాష్ట్ర ప్రభుత్వం వద్ద తగినన్ని నిధులు లేకున్న ప్రజల అవసరం మేరకు నిధులను సమీకరణ చేస్తూ రాష్ట్ర సుస్థిర అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి దోహదపడుతున్నారని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో విద్య,వైద్యం,వ్యవసాయం, రోడ్లు,సంక్షేమ పథకాల అమలులో బాన్సువాడ నియోజక వర్గం నెంబర్ వన్ నియోజకవర్గంగా నిలిచిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్,ఉమ్మడి కోటగిరి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ గైక్వాడ్



హనుమంతు,వైస్ చైర్మన్ కులకర్ణి అనిల్,కోటగిరి పిఏసిఎస్ చైర్మన్ కూచి సిద్ధు,జనరల్ ఫంక్షన్ హాల్ స్థలదాత కీర్తిశేషులు మిక్కిలి నేనే ప్రసాద్ రావు యొక్క కుటుంబ సభ్యులు శ్రీమతి రాజ్యలక్ష్మి,బంజారా సంఘం అధ్యక్షులు బధ్యానాయక్, అడికేష్ లింగమయ్య ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మలనేని రాజశేఖర్ దంపతులు,టిడిపి సీనియర్ నాయకులు అమర్నాథ్ బాబు,సీనియర్ నాయకులు వేములపల్లి కృష్ణారావు,మాజీ జెడ్పిటిసి శంకర్ పటేల్,మాజీ జడ్పిటిసి పుప్పాల శంకర్,మాజీ ఎంపీపీ గంధపు పవన్,బోధన్ కమ్మ సంఘం అధ్యక్షులు పల్లెం పాటి శివ నారాయణ,ఎన్టీఆర్ మరియు జనరల్ ఫంక్షన్ హాల్ (మిర్జాపూర్) అధ్యక్షులు దొప్పల పూడి శ్రీధర్,ఎన్టీఆర్ మరియు జనరల్ ఫంక్షన్ హాల్ (మిర్జాపూర్) క్యాషియర్ ధమ్మలపాటి ఉదయ భాస్కర్,మిర్జాపూర్ రామాలయ కమిటీ అధ్యక్షులు దమ్మల పాటి చౌదరి,ఎన్టీఆర్ అభిమాన సంఘం సభ్యులు కొల్లూరు రమేష్ బాబు, వేములపల్లి ఆనంద్,నార్ల సాయి శ్రీనివాస్,పత్తి లక్ష్మణ్,బీర్కూర్ శ్యాం,కూచి సిద్ధు,ఎన్టీఆర్ అభిమాన సంఘం మహిళా సభ్యులు దమ్మలపాటి పార్వతి, దోపాల పూడి సుజాత,నార్ల వెంకటరమణమ్మ,వీరపనేని రూపా బాజీ,దమ్మలపాటి లక్ష్మి,రమా రత్నాకర్,కోటగిరి, పొతంగల్ మండలాలకు చెందిన సర్పంచులు,సీనియర్ నాయకులు,బాన్సువాడ నియోజకవర్గం నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# గుంటూరు క్యాంపు గ్రామంలో సర్పంచ్ కొడుకే పెత్తనం కొనసాగిస్తున్నారు


- ప్రభుత్వ జాగా కబ్జాచేస్తున్న వార్డు మెంబర్



వర్ని/మే 28/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా వర్ని మండలం గుంటూరు క్యాంపు గ్రామంలో గ్రామ సర్పంచ్ కుమారుడు సర్వం తానే అంటూ వ్యవహరిస్తున్నాడని తండ్రి స్థానంలో కొడుకు పెత్తనం కొనసాగిస్తున్నారని గుంటూరు క్యాప్ గ్రామానికి చెందిన రైతు అదేవిధంగా నాయకులు గంగాధర్ అన్నారు ఈ సందర్భంగా వర్ని ఎమ్మార్వో కార్యాల మీదట నిరసన చేసి వినతి పత్రాన్ని ఎమ్మార్వో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడిమల్ గ్రామ శివారు ప్రాంతంలో ఎకరం నర భూమి కొనుగోలు చేస్తే పానాది ఉన్న ప్రభుత్వ భూమిని వాట్సాప్ చూడు కబ్జా చేసుకున్నారని ఈ వాట్సప్ కి సర్పంచ్ కొడుకు సపోర్ట్ చేస్తున్నారని అదేమిటని ప్రశ్నించడానికి పోతే తన భార్యపై దాడి చేయడంతో వర్ణి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుంటూ ఇష్టానుసారంగా వివరిస్తున్న వార్డు సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. గ్రామ సర్పంచ్ తన ఇంటి ఎదుట ఉన్న ప్రభుత్వ బావిని పూడ్చుకొని ఆ స్థలాన్ని కూడా కబ్జా చేసుకోవడం ఎంతవరకు సమంజసం అని గంగాధర్ ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచును ఫోన్ల వివరణ కోరగా తన కుమారుడు ఎలాంటి పెత్తనం కొనసాగించడం లేదని తనకు ఇంగ్లీషు రాకపోవడంతో తన కుమారుడు తనకు సహకారంగా ఉంటాడు అని అన్నారు. కొంతమంది భూకబ్జాలు చేసుకుంటూ తమపై నిరాదన ఆరోపణలు చేస్తున్నారని ఇది ముమ్మాటికి అవాస్తవమని ఫోన్లో సమాధానం ఇవ్వడం జరిగింది.


# బైక్ దొంగల అరెస్టు..6 బైకులు స్వాధీనం



నిజామాబాద్/మే 28/(జన సంఘర్షణ)

నిజాంబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్లను దొంగలిస్తున్నా ఓ ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి ఆరు మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నట్లు రఘుపతి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కామారెడ్డి పెద్ద కొడంగల్ శివపురానికి చెందిన వధేవ నవీన్ నిజాంబాద్లోని నాందేడ్ వాడలో నివసిస్తున్న మేస్త్రి పని చేస్తున్నాడు. నకిలీ తాళాలతో బైక్లను దొంగలించాడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

# రైలు ఢీకొని వ్యక్తి మృతి



నిజామాబాద్/మే 28/(జన సంఘర్షణ)

నిజామబాద్ జిల్లా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు నిజాంబాద్ రైల్వే ఎస్సై సాయి రెడ్డి బుధవారం రాత్రి తెలిపారు. ఆర్మూర్ మామిడిపల్లి రైల్వేటేషన్ మధ్యలో పట్టాలు దాటుతున్న వ్యక్తిని కరీంనగర్ నుంచి కాచిగూడడెమో రైలు ఢీ కొట్టిందని పేర్కొన్నారు. తీవగాయాల పాలైన వ్యక్తి అక్కడ అక్కడే మృతి చెందాడని వెల్లడించారు.మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లాభ్యం కాలేవని, ఎవరైనా గుర్తు పడితే నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్కు సంప్రదించరన్నారు.

# ఫిలింనగర్లో ఘనంగా ఎన్టీఆర్ 103 జయంతి వేడుకలు



హైదరాబాద్ఫిలింనగర్/మే 28/(జన సంఘర్షణ/

ఎన్టీఆర్103 జయంతి సందర్భంగా ఫిలింనగర్ లో ఎన్టీఆర్ కుమారుడు మోహన కృష్ణ, మనమరాళ్లు మోహన్ రూపా,దీపిక, కుటుంబ సభ్యులు, అట్లూరి రమాదేవి , పరుచూరి గోపాలకృష్ణ గ, బాబు మోహన్, సినీ ప్రముఖులతో కలిసి ఎన్టీఆర్ కి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ పాలనతో ప్రజల్లో చైతన్యం పెరిగిందని ఎన్టీఆర్ కుమారుడు మోహన్ కృష్ణ వెల్లడించారు . పార్టీ పెట్టి ఆరు నెలల్లోనే అధికారంలోకి వచ్చి ఎంతోమంది పేదలకు అండగా నిలిచారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం మనలో ఎన్టీఆర్ లేనప్పటికీ ఆయన చేసిన సేవలను స్మరించుకోవడం ఎంతో అభినందనీయమని ఆయన వెల్లడించారు. ఎన్టీఆర్ నిరుపేదలకు అండగా ఉండాలని విద్య, వైద్యం, వ్యవసాయ రంగం పై దృష్టి పెట్టారని ఆయన గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ ,కామారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ ఉపాధ్యక్షులు శ్రీ కమ్మ సత్యనారాయణ ప్రముఖులు పాల్గొన్నారు.


# కోనేరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కోనేరు శశాంక్ అన్న ఆధ్వర్యంలో యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ



తిరుమలాపూర్/మే28/(జన సంఘర్షణ)

భారతీయ జనతా పార్టీ నాయకులు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కోనేరు శశాంక్ అన్న ఆధ్వర్యంలో తిర్మలాపూర్ గ్రామంలో యువకులకు క్రికెట్ కిట్ పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల సీనియర్ నాయకులు మార్కెలి ప్రకాష్ పటేల్, రుద్రూర్ మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, కోటగిరి మండల అధ్యక్షుడు ఏమూల నవీన్ , పోతంగల్ మండలం జనరల్ సెక్రెటరీ బోయి విజయ్ కుమార్, బూత్ అధ్యక్షులు కాలే సాయికృష్ణ, కల్లూరి దత్తు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గంగాధర్, పోత్తంగల్మండల అధ్యక్షుడు, బజరంగ్, పబ్బా శేఖర్ ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ నగర్ కాలనీలో అశోక్ అను నాపై కొంతమంది దాడి చేశారు





రుద్రూరు మండల్/మే28/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండల కేంద్రంలో 2023 జూన్ మూడో తేదీన నాలుగో తేదీన రాజీవ్ నగర్ కాలనీలో అశోక్ అను నాపై కొంతమంది పెద్దమనుషులు అనగా రాజకీయ నేతలు బడాబాబులు దళితులను ఏదో ఒక రకమైన ఆశ చూపించి కోవటు చేసి ముందుగా వారితో దాడులు చేయించి తర్వాత కొంతమంది బీసీ కొంతమంది ముస్లింల తో దాడి చేయించిన పెద్ద మనుషులు రాజకీయంగా ఫెయిల్ అయిపోయి ప్రజలు గట్టి బుద్ధి చెప్పడంతో వారి నెత్తులన్నీ వారి తలలన్నీ కిందై ప్రజల్లో ముఖం లేకుండా తిరుగుతున్నారు పేదవాడు అశోక్ ఏమి చేయలేకపోవచ్చు కానీ దేవుడు మాత్రం రాజకీయంగా ఓడించి ప్రజల్లో మొఖాలు లేకుండా ప్రజల్లో తిరిగే మొఖాలు లేకుండా చేసిన ఆ భగవంతుడు పెద్దవారు భగవంతుని నమ్ముకున్న నాకు భగవంతుడే న్యాయం చేశారు వారు ఇంకా ఎన్ని సంవత్సరాలు అయినా రాజకీయంగా గెలవరు ప్రజలు వారికి గెలిపించరు కూడా ఎందుకంటే వారి కుటిల బుద్ధి ఒక సమూహం ఏర్పాటు చేసి దాడులు చేయించడం అన్నీ అక్రమాలు చేసే వారికి ఎప్పుడూ ప్రజలు గట్టి బుద్ధి చెబుతూనే ఉంటారు ఉండబోతారు కూడా భూత భవిష్యత్తు వర్తమాన కాలంలో ప్రజలు వారికి ఓటు అనే ఆయుధం ద్వారా ఇతరుల ద్వారా దెబ్బతీస్తూనే ఉంటారు ఇది ప్రజల తీర్పు అశోక్ పేదవాని ఉసురు ఎన్నో అక్రమ కేసులు బలయించారు బలయించబోతున్నారు కూడా ఎన్ని అక్రమ కేసులు బరించినా దేవుడు ఉన్నారు అధికారులపై ఒత్తిడి చేసి రౌడీషీద్ కేసు చేసి అక్రమ కేసులు చేస్తూనే ఉన్నప్పటికీ భగవంతుడు నన్ను కాపాడుతూనే ఉన్నారు. భగవంతుని ఆశీస్సులు ప్రజల యొక్క దీవెనలు నాకు ఉన్నంత సేపు ఇలాంటి రౌడీలు, గుండాల యొక్క ఆగడాలు నాపై కొనసాగబోవు ఎందుకంటే దేవుని ఆశీస్సులు నాకున్నఈ ప్రజల అండదండలు నాకు ఉన్నాయి.

# మహిళను హత్య చేసి నగలు దోచుకెళ్లిన దుండగులు



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల/మే28/(జన సంఘర్షణ,


రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో ఓ మహిళను అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈర్లపల్లి రెవెన్యూ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి మైసమ్మ (45)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. దుండగులు మహిళ గొంతు కోయడంతో పాటు రెండు కాళ్లను కూడా తీవ్రంగా గాయపరిచి హత్య చేసినట్లు గుర్తించారు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారం, కాళ్లకు ధరించిన సుమారు 50 తులాల వెండి పట్టీలు దోచుకెళ్లినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.మృతురాలు మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లగా, మరుసటి రోజు చేవెళ్ల-శంకర్పల్లి రోడ్డుకు సమీపంలోని ఓ గార్డెన్ దారిలో ఆమె మృతదేహం కనిపించింది. భర్త మరణంతో మైసమ్మ తన తల్లి ఇంటి వద్దే నివాసం ఉంటున్నట్లు తెలిసింది. ఆమె కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు.హత్య జరిగిన ప్రాంతం సమీపంలో మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, మిక్సర్ ప్యాకెట్లు, మిర్చి బజ్జీలు లభించడంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్స్ నిపుణులు, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృతురాలు కొంతమందితో కలిసి తరచూ కల్లు తాగేదని, హత్య జరిగిన రోజూ కూడా కొందరితో కలిసి ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్టు సమాచారం. అలాగే రెండు నెలల క్రితం నమోదైన ఫోన్ దొంగతనం కేసు కోణాన్ని కూడా విచారిస్తున్నారు ఈకేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. పరిచయస్తుల ప్రమేయం ఉందా..? లేక ఇతర ముఠాల హస్తం ఉందా..? అనే దానిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు

# డిల్లీ గులాంలకు.. హైదరాబాద్ గులాబీకి చాలా తేడా ఉంది

- మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్కు రోజులు దగ్గరపడ్డాయి
- కార్యకర్త జోలికొస్తే ఊరుకోం.. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే: 70ఎంఎం సినిమా చూపిస్తాం!
- బోడుప్పల్ బీఆర్ఎస్ సమావేశంలో మేడ్చల్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి

**బోడుప్పల్ :**

మేడ్చల్ నియోజకవర్గం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్లో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, చామకూర మహేందర్ రెడ్డి హాజరై, బూత్ కమిటీ సభ్యులకు నూతన డిజిటల్ సభ్యత్వ నమోదు ఎస్ ఐఆర్ (ఓటర్ల జాబితా సవరణ) అంశాలపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో అధికారం కోల్పోవడం తాత్కాలికమేనని, విపక్షంలో ఉండే ఈ సమయం పార్టీ అంతర్గత బలాన్ని పెంచుకోవడానికి ఒక గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ఢిల్లీ కేంద్రంగా నడిచే కాంగ్రెస్, బీజేపీల కంటే.. తెలంగాణ ప్రయోజనాల కోసం హైదరాబాద్ నుంచే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ పోరాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, 6 గ్యారెంటీలు, 420 హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సోషల్ మీడియా ద్వారా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే "సోషల్ మీడియా వారియర్స్" తయారుచేయడమే లక్ష్యమని తెలిపారు. యువతను ఆకర్షించేందుకు డిజిటల్ సభ్యత్వ నమోదు కీలకమని అన్నారు. బీఆర్ఎస్లో చేరే ప్రతి కార్యకర్తకు ఇది సాధారణ రాజకీయ పోరాటం కాదని, తెలంగాణ పునర్నిర్మాణంలో రెండో దశ ఉద్యమమనే భావన కల్పించాలని నాయకులు



పిలుపునిచ్చారు. నాయకత్వం క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ తన పూర్వ వైభవాన్ని చాటుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి మాట్లాడుతూ...

ప్రస్తుత పరిస్థితుల్లో కార్యకర్తలకు ఆర్థిక భరోసా కంటే ఆత్మగౌరవ భరోసా, రాజకీయ రక్షణ చాలా ముఖ్యమని ఆయన ఉద్ఘాటించారు. కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతూ వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులకు భవిష్యత్తులో 70ఎంఎం సినిమా చూపిస్తామని, రానున్న రోజుల్లో 'డీ అంటే డీ' అనే విధంగా తలపడతామని హెచ్చరించారు. బాధితులకు లీగల్ సెల్ ద్వారా తక్షణ ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, స్థానిక నేతలు ఎల్లప్పుడూ



కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పోచారం మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏదవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కొడే పోచయ్య, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, శ్యామల శ్రీను, బోడుప్పల్ నాయకులు కొత్త రవి గౌడ్, సామల సందీప్ రెడ్డి, కొత్త చక్రపాణి గౌడ్, కాటిపల్లి రాంచంద్రరెడ్డి, బండారం శ్రీధర్ గౌడ్, రమేష్ యాదవ్, మీసాల కృష్ణ, అలీం, రవికుమార్, ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, బాలమల్లేష్, నాగేశ్వర్ గౌడ్, బొమ్మక్ విశ్వనాథం, రాసాల మహేష్ యాదవ్, ఉప్పరి విజయ్, కీర్తణ్,మాజీ ఎంపీటీసీ లు, నాయకులు,బూత్కమిటీసభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హనుమాన్ నగర్ సమస్యల పరిష్కారానికి కృషి:పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్ :**



ఉప్పల్ హనుమాన్ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. కాలనీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఏనుగు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులు పరమేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు.రోడ్లు, డ్రైనేజీ సమ స్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. త్వరలో కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలిస్తామని చెప్పారు. కాలనీ అభివృద్ధికి ప్రజలు ఐక్యంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు

**ధర్మసాగర్ :**



ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన చెట్ల మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో అయన కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. 1997-98 పదో తరగతి బ్యాచ్ కు చెందిన తోటి విద్యార్థులు మహేష్ కుటుంబ పరిస్థితి తెలుసకుని మానవత్వంతో ముందుకు వచ్చా రు. గురువారం మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మిత్రులు, అతని భార్య, తల్లిదండ్రులు, తమ్ముడికి రూ.45 వేల రూపాయలను ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో ఆ కుటుంబం ఒంటరిగా లేదని, తాము అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా స్నేహితులు మహేష్ తో గడిపిన పాఠశాల జ్ఞాపకాలు నెమరు వేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. జీవతంలో నిజమైన స్నేహం విలువ ఇలాంటి సందర్భల్లోనే తెలుస్తుందని అన్నారు. చిన్ననాటి మిత్రులు చూపిన మానవత్వాన్ని స్థానికులు అభినందించారు.

## మరోసారి మాట నిలబెట్టుకున్న మల్లికుదుర్ల గ్రామ సర్పంచ్

-ఆడబిడ్డ జన్మించిన కుటుంబానికి రూ.5,016 ఆర్థిక సహాయం అందజేత

**వేలేరు :**



గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని మరోసారి నిలబెట్టుకుంటూ మల్లికుదుర్ల గ్రామ సర్పంచ్ జక్కుల మౌనిక సంపత్ యాదవ్ ఆదర్శంగా నిలిచారు. గ్రామంలోని ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన సర్పంచ్, ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేసి తన మాట నిలబెట్టుకున్నారు.గ్రామ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామంలో జన్మించే ప్రతి ఆడబిడ్డకు తమ వంతు సహాయంగా రూ.5,016 అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహమ్మద్ జహంగీర్ కుమారుడు మహమ్మద్ సమీర్ -- సమ్రీన్ దంపతులకు ఇటీవల ఆడబిడ్డ జన్మించడంతో, ఇచ్చిన మాట ప్రకారం సర్పంచ్ జక్కుల మౌనిక సంపత్ యాదవ్ రూ.5,016 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ జక్కుల మౌనిక సంపత్ యాదవ్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని, ఎల్లప్పుడూ ప్రజల కోసం ముందుండి పనిచేస్తామని తెలిపారు. తాము ఎప్పటికీ నాయకులు కాదని,ప్రజలకు సేవ చేసే సేవకులమాత్రమేనని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,బీఆర్ఎస్ గ్రామ

## ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

-26వ సారి రక్తదానం చేసిన ఉప్పల్ టీడీపీ సీనియర్ నాయకుడు పబ్బతి శేఖర్ రెడ్డి

**ఉప్పల్ :**

మాజీ ముఖ్యమంత్రి,తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, నటరత్న నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు పబ్బతి శేఖర్ రెడ్డి 26వ సారి రక్తదానం చేసి ప్రత్యేకంగా నిలిచారు.రక్తదాన శిబిరానికి ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 26 సార్లు రక్తదానం చేసిన పబ్బతి శేఖర్ రెడ్డిని అభినందిస్తూ, సమాజ సేవలో భాగంగా రక్తదానం చేయడం ఎంతో గొప్ప కార్యక్రమమని



ప్రశంసించారు.పబ్బతి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో ముందుండటం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని, యువత ఎక్కువగా ఇలాంటి



సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తాళికోట హరికృష్ణ,టీజీకే మూర్తి, కూతడి నర్సింహ,సంధ్యపోగు రాజశేఖర్,సాయినాగార్జున తదితర నాయకులు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ 13వ జయంతి నివాళులర్పించిన టిడిపి నాయకులు

**శంకరపట్నం:**

విశ్వవిఖ్యాత నటసార్వ భౌముడు, తెలుగు జాతి ముద్దుబిడ్డ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనందమూరి తారక రామారావు 103 వ జయంతి, 2026 మహానాడు సందర్భంగా శంకరపట్నం మండలం లోని టీడీపీ జెండా గద్దె వద్ద తెలుగుదేశం పార్టీ అడ్ హాక్ కమిటీ పార్లమెంట్ సభ్యులు మోరె ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలతో ఘనంగా నివాళ్ళు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జాతి వైభవాన్ని దేశం నలుమూలల చాటి చెప్పిన ఘనత శ్రీ నందమూరి తారక రామారావు గారిదని, చిత్ర రంగానికి ఆయన ఎనలేని సేవ చేశారని అన్ని పాత్రలు పోషించి ప్రజల హృదయాలలో నిలిచిపోయారని, అనంతరం రాజకీయాలలో ప్రవేశించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని, రాజకీయాలలో ఆయన చేసిన మార్పుల వల్ల ఈరోజు



బడుగు బలహీన వర్గాలు నాయకత్వ పటిమను ప్రదర్శిస్తున్నాయని తెలిపారు.ఆయన వేసిన బాటలోనే తర్వాత వచ్చిన ప్రభుత్వాలన్నీ ఆయన పథకాలను కొనసాగిస్తున్నాయని తెలిపారు.నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి 9 నెలలకు అధికారం లోకి తీసుకు వచ్చిన ఘనత ఆయనది. ఎన్టీఆర్ ముఖ్య మంత్రి అయన తరువాత రెండు రూపాలకు కిలో బియ్యం, పేద వాళ్ళ కు ఇండ్లు, వృద్ధులకు పెంచాన్, పటేల్,పట్వారి వ్యవస్థ పై ఉక్కు పదం మోపిన నాయకుడు.రైతులకు భూమి శిస్తూ నుండి విముక్తి కలిగించిన ఏకైక ముఖ్య మంత్రి.మహిళలకు సమానహక్కులు కలిగి ఉండేలా జీవో తీసుకొచ్చిన మహనీయులు.మహిళా సంఘాలకు ఋణలాతో పాటు సంక్షేమ పథకలు, చట్ట సభల్లో అధికారాలు తీసుకు వచ్చిన నాయకుడు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బైరి తిరుపతి, షాబీర్,దాసారపు సాగర్, వీరమాల్లు బూర్ల కొమురయ్య,తో పాటు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.50కోట్లతో చింతల చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు...

- చెరువును మరింత ఆధునీకరించి, సుందరంగా తీర్చిదిద్దుతాం...
- ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా ప్రణాళికలు...
- చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం....
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు..

**చుంచుపలి :**

చుంచుపల్లి మండల, విద్యానగర్ పంచాయతీ పరిధిలోని చింతల చెరువు చుట్టూ రూ.1.50కోట్లతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి జరుగుతోందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపి అనుమతులు మంజూరు చేయించడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే



పనులు ప్రారంభిస్తామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం ఆయన చింతల చెరువును క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతల చెరువును మరింత ఆధునీకరించి, అద్భుతంగా సుందరీకరిస్తామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఎంతగానో ఉపయోగపడే విధంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. స్థానికులకు మెరుగైన వసతులు కల్పించడమే



తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, సర్పంచి శాంతి శ్రీ, భాగం నాగమణి, మాధవరావు, తాటి కృష్ణవేణి, ఏపూరి కృష్ణమూర్తి, కె రామారావు, కృష్ణ, నర్సింహారావు, సురేష్, గంగయ్య, భద్రం, ప్రసాద్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
29 మే 2026

## బక్రీద్ పండుగ త్యాగం భక్తి,విశ్వాసానికి ప్రతీక

**అన్నపరెడ్డిపల్లి :**



బక్రీద్ పండుగ త్యాగం, భక్తి, విశ్వా సానికి ప్రతీక అని మహ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను, సోదర భావా న్ని అందరూ అనుస రించాలని అన్నపు రెడ్డిపల్లి మండల ముస్లిం మైనార్టీ అధ్య క్షుడు షేక్ సుభాని అన్నారు. బక్రీద్ పండుగ పర్వదిన వేడుకలను గురు వారం అన్నపరెడ్డిపల్లి మండల పరిధి లోని గ్రామాల లో ముస్లిం మైనార్టీ సోదరులు ఘనంగా నిర్వహిం చారు. ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల ముస్లిం సోదరులు వారి వారి గ్రామాలలో ఈద్గాల వద్ద హాజరై ఒకరి కొకరు ఈదుల్ అదా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నమాజ్ వేడుకల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై విజయ్ సింహా రెడ్డి ఆధ్వర్యం బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఘనంగా నందమూరి తారక రామారావు 103 జయంతి వేడుకలు..

**-ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే జారె..**

**అశ్వారావుపేట :**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక స్వర్గీయ నందమూరి తారకరామారావు, 103వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినా రాయణ, దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థా యిగా నిలిచిపోయిన మహానేత రాజకీయాల్లోనే కాకుండా సినీరంగంలో కూడా విశిష్టసేవలు అందించారని కొనియాడారు. పేదప్రజల అభ్యు న్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజానాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని తెలుగువారి గౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు, ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసు కోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**బీజేపీ నాయకులు తంబళ్ల రవి..**



**అశ్వారావుపేట :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మ పేటలో గురువారం ఉదయం గాలి వానల వల్ల నష్టపోయిన మామిడి రైతులను పరామర్శించిన బిజెపి నాయకులు తంబళ్ల రవి, వారు మాట్లాడుతూ అకాల వర్షం వల్ల మామిడి రైతులకు తీవ్ర నష్టం కలిగిందని,మామిడి రైతులను ఆదుకోవడం చాలా అవసరం,చేతికొచ్చిన పంట చేజారిపోవడంతో రైతులు ఆర్థికంగా ఎంతో కుంగిపోతారు,ఇలాంటి క్లిష్ట సమ యంలో వారికి తక్షణ సాయం అందించడం ప్రభుత్వం బాధ్యత,రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే నష్టపోయిన తోటలను సందర్శించి, క్షేత్రస్థాయిలో సర్వే జరిపి నష్టాన్ని ఖచ్చితంగా అంచనా వేయాలనీ,నష్ట పోయిన రైతులకు వెంటనే న్యాయం చేయాలని బీజేపీ నాయకులు తంబళ్ల రవి డిమాండ్ చేశారు.

## బక్రీద్ ఉత్సవాల్లో పాల్గొన్న సింగిరెడ్డి పద్మా రెడ్డి

**ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు**



**బోడుప్పల్ :**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ముస్లిం సోదరులు బక్రీద్ వేడు కను ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా బోడు ప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరే టర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, సీసా వెంకటేష్ గౌడ్, బుక్కా సుమన్, తదితరులు పలువురు ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు బక్రీద్ వేడుకలలో పాల్గొని వారికి బక్రీద్ పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు, బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అసర్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## తిప్పర్తిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తనిఖీ చేసిన కలెక్టర్

**మాడుగుల పల్లి :**



నల్గొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రమైన తిప్పర్తిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పెండింగ్ పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు గురువారం ఆయన తిప్పర్తిలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఇళ్లలో మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు అందించేలా తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లకు సంబంధించిన విద్యుద్దీకరణ, శానిటేషన్, కిటికీలకు అద్దాల అమరిక, బాత్రూములు, తలుపుల ఏర్పాటుతో పాటు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉందన్నారు ముఖ్యంగా పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారుఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ జ్యోతి, అధికారుల బృందం చంద్రశేఖర్, బాలునాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వేలేరు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా బక్రీద్ వేడుకలు

**వేలేరు :**

వేలేరు మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులుబక్రీద్ పండుగ వేడుకలు నిర్వహించారు,ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఈ యొక్క పండుగ విశిష్టతలను విశ్లేషించారు ఇస్లాం మతంలో బక్రీద్ పండుగ పవిత్రమైన పండుగని త్యాగాల పండుగగా పిలుస్తారు అల్లా ఆదేశం మేరకు హజ్రత్ ఇబ్రహీం తన ప్రాణానికి ప్రాణమైన కొడుకును సైతం బలివ్వడానికి సిద్ధపడిన గొప్ప త్యాగాన్ని అచంచలమైన విశ్వాసాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ జరుపుకుంటారు ఈ పండుగ రోజున ఇస్లామిక్ నియమా లకు అనుగుణంగా గొర్రె మేక లేదా ఒంటెలను బలి ఇస్తారు కుర్బానీ చేసిన మాంసాన్ని మూడు భాగాలుగా విభజిస్తారు ఒక భాగం పేదలకు రెండవ భాగం బంధువులు స్నేహితులకు మూడవ భాగం కుటుంబ సభ్యులకు కేటాయిస్తారు పండుగ రోజు ఉదయం ముస్లింలందరూ మసీదులకు లేదా ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక



ప్రార్థనలు చేస్తారు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు, ప్రజలందరూ సుఖసంతోషాలతో శాంతియుతంగా ఉండాలని ఆ అల్లాని కోరుకుంటున్నామని వారు తెలిపారు,

## భూరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులుగా నత్తి కోర్నేల్ నియామకం

**అసైన్డ్ భూములకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలి :**

**రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుగ్గ మైసన్న**

**హనుమకొండ :**

తెలంగాణ భూ రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులుగా దళిత రత్న నత్తి కోర్నేల్ నియమితుల య్యారు.గురువారం రోజున నత్తి కోర్నేల్ అధ్యక్షతన భూ రక్షణ సమితి ముఖ్య సమావేశం హనుమకొండ హంటర్ రోడ్ లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూ రక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుగ్గ మైసన్న ముఖ్య అతిథిగా హాజరై, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని నూతన కమిటీలను అధికారికంగా ప్రకటిం చారు.ఈ సందర్భంగా బుగ్గ మైసన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో దశాబ్దాలుగా అసైన్డ్ భూములను నమ్ముకుని సాగు చేసుకుంటున్న నిరుపేద, దళిత, వెనుకబడిన వర్గాల రైతులకు ప్రభుత్వం పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ భూములపై హక్కులు



లేకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి అసైన్డ్ భూముల కొను గోలు, అమ్మకాలకు చట్టబద్ధమైన అనుమతులు ఇవ్వాలని కోరారు.నూతన కమిటీల వివరాలను వారు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ జిల్లాలకు నూతన అధ్యక్షులను ఈ క్రింది విధంగా నియమిం చారు.ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు నత్తి కోర్నేల్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందికట్ల రాజయ్య, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు పాముల రమేష్, జనగామ జిల్లా అధ్యక్షుడు మిద్దెపాక మహేందర్,మహబూబాబాద్



జిల్లా అధ్యక్షుడు పందుల సారన్న, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మంద సాబయ్య,ములుగు జిల్లా అధ్యక్షుడు పెండేల సుందర్, రాష్ట్ర వైస్ చైర్మన్ అర్శం అశోక్ నియమించారు. ఈ సమావేశంలో భూ రక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిద్దెపాక సిద్దులు, ఎస్సీ,ఎస్టీ అట్రా సిటీ చైర్మన్ దళిత రత్న డబ్బేట రమేష్, ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి వచ్చిన అసైన్డ్ భూముల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు భూ రక్షణ సమితి ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

## తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్ :**

తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని హైటెన్షన్ రోడ్‌లో కమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో, జమ్మిగడ్డలో ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో, అలాగే మీర్‌పేట హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలో ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, తెలుగు జాతి గర్వించదగ్గ మహాను భావుడైన ఎన్టీఆర్ రాజకీయాల్లోనే కాకుండా సినీరంగం లోనూ చెరగని ముద్ర వేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సాధారణ ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపో



యారని తెలిపారు.ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన నాయకుడని పేర్కొన్న ఎమ్మెల్యే, ఆయన ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. సమాజ సేవ, ప్రజా సంక్షేమం పట్ల ఆయన చూపిన అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో నిబద్ధత, ప్రజల పట్ల సేవాభావం ఎలా ఉండాలో ఎన్టీఆర్ జీవితం ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఎన్టీఆర్ ప్రజల మనిషిగా గుర్తింపు పొందారని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పటికీ ప్రజల మదిలో నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ యువత సమాజ అభి వృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుభాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ





రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు ఘన నివాళులు అర్పించారు.

## ఒకేసారి రెండు క్యాన్సర్లకు చికిత్స: మలక్‌పేట్ యశోదా హాస్పిటల్స్ వైద్యుల ఘన విజయం

**అత్యాధునిక ప్రెసిషన్ రేడియేషన్ సాంకేతికతతో మహిళకు పునర్జన్మ**

**చికిత్స ముగిసి రెండేళ్లు దాటినా లభించని క్యాన్సర్ ఆనవాళ్లు**

**మాడుగుల పల్లి :**

వైద్య రంగంలో అత్యంత అరుదైన, విశేషమైన విజయాన్ని యశోద హాస్పిటల్స్ (మలక్‌పేట్) వైద్య బృందం సాధించింది. ఒకే సమయంలో రెండు వేర్వేరు ప్రాథమిక క్యాన్సర్ల బారిన పడిన 64 ఏళ్ల మహిళకు అత్యాధునిక ప్రెసిషన్ రేడియేషన్ థెరపీ, మల్టీడిసిప్లినరీ క్యాన్సర్ కేర్ ద్వారా విజయవంతంగా చికిత్స అందించి నూతన జీవితాన్ని ప్రసాదించారు. చికిత్స పూర్తయి రెండేళ్లు గడిచిన తర్వాత నిర్వహించిన తాజా PET-CT స్కాన్ పరీక్షల్లో రోగి శరీరం లో ఎటువంటి క్యాన్సర్ ఆనవాళ్లు లేవని, ఆమె పూర్తిగా కోలుకున్నారని వైద్యులు వెల్లడించారు.

**స్కానింగ్‌లో బయటపడ్డ డ్యూయల్ క్యాన్సర్**

సదరు మహిళ మొదట గర్భాశయ రక్తస్రావం (పీవీ బ్లీడింగ్) సమస్యతో బాధపడుతూ బయట ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. అనంతరం పరీక్షల్లో ఆమెకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) ఉన్నట్లు నిర్ధారణ కావడంతో తదుపరి చికిత్స కోసం మలక్‌పేట్ యశోద హాస్పిటల్స్‌కు వచ్చారు. అయితే, క్యాన్సర్ తీవ్రతను అంచనా వేసేందుకు ఇక్కడ నిర్వహించిన PET-CT స్కాన్‌లో ఊహించని విధంగా ఎడమ ఊపిరితిత్తి దిగువ భాగంలో మరో అనుమానాస్పద గడ్డ, లింఫ్ నోడ్స్ ఇన్‌వాల్వ్‌మెంట్ బయటపడింది. బయాప్సీ మరియు నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (NGS) పరీక్షల ద్వారా ఇది 'EGFR-పాజిటివ్ లంగ్ అడెనోకార్సినోమా' అనే రెండో ప్రాథమిక క్యాన్సర్‌గా తేలింది. వైద్య పరిభాషలో దీనిని అత్యంత అరుదైన 'సింక్రోనస్ డ్యూయల్ ప్రైమరీ క్యాన్సర్స్' కేసుగా గుర్తించారు.

**అత్యాధునిక సమగ్ర చికిత్స**

సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డా. నివాలికా రాజమోని, కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డా. ఎల్. రోహిత్ రెడ్డిల పర్యవేక్షణలో రోగికి రెండు క్యాన్సర్లకూ ఒకేసారి సమగ్ర చికిత్స ప్రారంభించారు.ఊపిరితిత్తుల గడ్డకు రాడికల్ రేడియేషన్, పెల్విస్ ప్రాంతానికి అడ్జువెంట్ రేడియేషన్, ఎక్స్‌టర్నల్ బీమ్ రేడియేషన్ థెరపీ (ఙదీ=ు) అనంతరం వెజైనల్ బ్రాకీథెరపీని అందించారు. దీనితో పాటు సమాంతరంగా కీమోథెరపీ, ఊపిరితిత్తుల క్యాన్సర్ నియంత్రణ కోసం దీర్ఘకాలిక లక్షిత చికిత్సగా 'గెఫిటినిబ్' మాత్రలను అందించారు. ఆసుపత్రిలోని అత్యాధునిక ఇమేజ్-గైడెడ్ రేడియేషన్ టెక్నాలజీ ద్వారా చుట్టుపక్కల ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, కేవలం క్యాన్సర్ ఉన్న భాగాలకే




కచ్చితత్వంతో కూడిన రేడియేషన్ అందించడం విశేషం.

**ఆధునిక వైద్య విజ్ఞానానికి నిదర్శనం**

ఈ విజయవంతమైన చికిత్సపై డా. నివాలికా రాజమోని మాట్లాడుతూ, ఒకేసారి రెండు వేర్వేరు క్యాన్సర్లకు చికిత్స అందించడం అత్యంత క్లిష్టమైన సవాలు. రోగి శరీరంపై ఎక్కువ భారం పడకుండా ప్రెసిషన్ రేడియేషన్ సాంకేతికతతో ఊపిరితిత్తులు, పెల్విక్ ప్రాంతాలను కచ్చితత్వంతో టార్గెట్ చేశాం రెండేళ్ల తర్వాత కూడా రోగి క్యాన్సర్ ఫ్రీగా ఉండటం ఆనందంగా ఉంది అన్నారు డా. ఎల్. రోహిత్ రెడ్డి మాట్లాడుతూ..కీమోథెరపీ, ప్రెసిషన్ రేడియేషన్, లక్షిత థెరపీలను సమర్థవంతంగా సమన్వయం చేయడం వల్లే పూర్తి స్థాయి వ్యాధి నియంత్రణ సాధ్యపడిందని తెలిపారు.యాజమాన్యం తరపున ఆసుపత్రి డైరెక్టర్ శ్రీ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ శ్రీ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ శ్రీనివాస్ చిదురలు మాట్లాడుతూ.. ఇలాంటి సంక్లిష్ట కేసుల్లో అద్భుత ఫలితాలు సాధించడం యశోద హాస్పిటల్స్ లోని అత్యాధునిక సాంకేతికతకు, అనుభవజ్ఞులైన వైద్య

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co